


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 72 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం శుక్రవారం 23 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 72 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM FRI 23 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

## కమిషనర్ గారు..! మీకు అర్థం అవుతుందా..?




- కోట్ల జీవీఎంసీఉ చిల్లర ఖర్చుకూ చేతులు జాపే దుస్థితి!
- ప్రజారోగ్య శాఖను పట్టిపీడిస్తున్న కాలం చెల్లిన వాహనాల భూతం
- పేరుకే కోట్ల ఆదాయంఉ పనికొచ్చే వాహనాలే కరవు
- 96 వార్డులు 10 జోన్లుఉ క్షేత్రస్థాయిలో గందరగోళం
- ప్రమాదాలకు ఆహ్వానం పలుకుతున్న పాత వాహనాలు
- కొత్త వాహనాల కొటేషన్లు.. ఫైళ్లకే పరిమితం

**గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) ఆదాయం అక్షరాల కోట్ల రూపాయల్లో ఉన్న మహాసంస్థ. కానీ అదే సంస్థ ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన ఖర్చుల విషయంలో మాత్రం చిత్తశుద్ధి కోల్పోయిందా అన్న అనుమానాలు బలపడుతున్నాయి. ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన శాఖలోనే నిర్లక్ష్యం పరాకాష్టకు చేరిందని, కాలం చెల్లిన వాహనాలతోనే సేవలు కొనసాగించడం ద్వారా అధికారుల వైఖరి బహిర్గతమవుతోంది.**

బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్,విశాఖపట్నం, జనవరి 22 :

గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) పేరుకే కోట్ల రూపాయల ఆదాయం ఉన్న మహా సంస్థ. కానీ ఖర్చు విషయానికి వచ్చేసరికి మాత్రం పేదోడిలా ప్రవర్తిస్తున్న తీరు అధికారుల పనితీరుపై తీవ్ర ప్రశ్నలు లేపుతోంది. ముఖ్యంగా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన ప్రజారోగ్య శాఖ పరిస్థితి చూస్తే, జీవీఎంసీలో అసలు జబ్బే అక్కడే ఉందేమో అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఇటీవల జీవీఎంసీ పరిధిలోని 96 వార్డులను 10 జోన్లుగా విభజించారు. పాలన సులభతరం చేయాలన్న ఉద్దేశంతో చేసిన ఈ విభజన కాగితాలకే పరిమితమైందని, క్షేత్రస్థాయిలో పరిస్థితి మరింత దారుణంగా మారిందని ఉద్యోగులు, ప్రజలు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. కారణంఉ సానిటేషన్, మలేరియా విభాగాల్లో ఉపయోగిస్తున్న వాహనాల పరిస్థితి.

**సెల్లార్లకే పరిమితమవ్వాల్సిన వాహనాలుఉ రోడ్లపై పరుగులు!**

కాలం చెల్లి, పూర్తిగా ఖండం అయిపోయిన వాహనాలను ఇప్పటికీ విధుల్లో వినియోగిస్తున్నారన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ఇవి వాడకానికి అర్హత కోల్పోయి ఉండాల్సిన వాహనాలు. కానీ అధికారుల నిర్లక్ష్యం, నిర్లిప్త వైఖరి వల్ల అవే వాహనాలు రోడ్లపై తిరుగుతూ ప్రమాదాలకు దారితీస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.

**కొత్త వాహనాల కోసం కొటేషన్లుఉ ఫైళ్లలోనే సమాధి**

కొత్త వాహనాల కొనుగోలుకు ఎన్నిసార్లు కొటేషన్లు పిలిచినా, అవన్నీ మెకానిక్ సెక్షన్, ఈఈ కార్యాలయాల కబోర్డుల్లోనే దుమ్ము పట్టి ఉన్నాయన్న విమర్శలు ఉన్నాయి. అవసరం ఉన్నా, నిధులు ఉన్నా కొత్త వాహనాలను విడుదల చేయడంలో అధికారులు ఎందుకు వెనుకడుగు వేస్తున్నారన్న ప్రశ్నకు సమాధానం లభించడం లేదు.

**ప్రమాదాలు జరిగినాఉ గుట్టుచప్పుడు కాకుండా కొనసాగింపు!**

పాత వాహనాల వల్ల ఇప్పటికే పలు చిన్నపాటి ప్రమాదాలు చోటుచేసుకున్నాయన్న సమాచారం ఉన్నా, వాటిని బయటకు రానివ్వకుండా మళ్లీ అదే వాహనాలను వినియోగించడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని చెప్పవచ్చు. ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన శాఖలోనే ఇంత అలసత్వం ఉంటే, ఇక నగర ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంటుందన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**జోన్లు పెరిగాయిఉ వాహనాలు మాత్రం పెరగలేదు!**

వార్డుల పరిధి పెరిగి, పనిభారం అధికమైనా కనీసం కొత్త వాహనాలు ఇవ్వకుండా, కాలం చెల్లిన చిన్న వాహనాలతోనే సేవలు కొనసాగించాలనుకోవడం ప్రజారోగ్యంపై చేస్తున్న నేరంతో సమానమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

> కోట్ల రూపాయల బడ్జెట్ ఉన్న జీవీఎంసీ ప్రజల ఆరోగ్యాన్ని ఇలా నిర్లక్ష్యం చేస్తే నగర భవిష్యత్తు ఏమవుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా జీవీఎంసీ
>
> **ఇప్పటికైనా స్పందించాలి... కమిషనర్ గారూ!**
>
> ఉన్నతాధికారులు, ముఖ్యంగా కమిషనర్ స్పందించి ప్రజారోగ్య శాఖకు తక్షణమే కొత్త వాహనాలు అందించి, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. లేకపోతే.. ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన సంస్థే ప్రజల ఆరోగ్యానికి ప్రమాదంగా మారిందన్న ముద్ర జీవీఎంసీపై పడడం ఖాయమనే హెచ్చరికలు వినిపిస్తున్నాయి.

**ఎపిసోడ్ -2 లో....**

**ప్రజారోగ్య శాఖలోనే అసలు 'జబ్బు'?**

**కొత్త వాహనాల కొటేషన్లుఉ ఫైళ్లకే పరిమితం చేసింది ఎవరు..?**

## ఆ కోటరీని నమ్మితే జగన్ ఎప్పటికీ అధికారంలోకి రాలేరు




- లిక్కర్ స్కాంలో ముగిసిన విజయసాయి రెడ్డి ఈడీ విచారణ
- అనంతరం మీడియాతో మాట్లాడిన విజయసాయి
- రాజకీయాల నుంచి తప్పుకోవడం లేదని స్పష్టం
- జగన్ చుట్టూ ఉన్న కోటరీ వల్లే పార్టీకి నష్టమంటూ వ్యాఖ్య
- తనపై చేసిన వ్యాఖ్యలను జగన్ వెనక్కి తీసుకోవాలని డిమాండ్

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్ ఆరోపణల నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరైన వైసీపీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి, అనంతరం మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన రాజకీయ భవిష్యత్తుపై కీలక ప్రకటన చేయడంతో పాటు, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చుట్టూ ఉన్న కోటరీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వారి వల్లే పార్టీకి ఈ దుస్థితి దాపురించిందని, ఆ కోటరీ మాటలు నమ్మితే జగన్ మళ్లీ అధికారంలోకి రావడం అసాధ్యమని తేల్చిచెప్పారు.గత ఏడాది రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించిన విజయసాయి రెడ్డి, ఆ నిర్ణయంపై యూ–టర్న్ తీసుకున్నారు. తాను రాజకీయాల నుంచి తప్పుకోవడం లేదని, జూన్ తర్వాత తన రాజకీయ భవిష్యత్ ప్రణాళికలను వెల్లడిస్తానని స్పష్టం చేశారు. లిక్కర్ స్కామ్

- మిగతా 2లో...

## దావోస్ వేదికగా ఆసక్తికర భేటీ... రేవంత్ రెడ్డిని కలిసిన నారా లోకేశ్

- పరస్పర సహకారంతో అభివృద్ధిపై ఇరు నేతల చర్చ
- ఏపీ విద్యా సంస్కరణలు, ఐటీ ప్రగతిని వివరించిన నారా లోకేశ్
- తెలంగాణ స్కిల్ క్యాంపస్‌లను చూడాలని లోకేష్‌కు రేవంత్ ఆహ్వానం
- మేడారం జాతరకు రావాలని లోకేష్‌ను ఆహ్వానించిన సీఎం



- మిగతా 2లో...

## లోయలో పడిన ఆర్మీ వాహనం.. 10 మంది సైనికులు మృతి

- జమ్మూకశ్మీర్ లోని దోడా జిల్లాలో ఘోర ప్రమాదం
- 200 అడుగుల లోతులోకి పడిపోయిన బుల్లెట్ ప్రూఫ్ వాహనం
- గాయపడిన సైనికులు మిలిటరీ ఆసుపత్రికి తరలింపు



**పెన్ పవర్ డెస్క్:**జమ్మూకశ్మీర్ లోని దోడా జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఇండియన్ ఆర్మీకి చెందిన వాహనం లోయలో పడిపోయింది. చంబా–బందేర్వా హైవేపై ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 10 మంది సైనికులు ప్రాణాలు కోల్పోగా... పలువురు గాయపడ్డారు. ఆర్మీకి చెందిన బుల్లెట్ ప్రూఫ్ వాహనంలో 17 మంది ప్రయాణిస్తున్నారు. డ్రైవర్ వాహనాన్ని అదుపు చేయలేకపోవడంతో ప్రమాదం సంభవించింది. లోయలో సుమారు 200 అడుగుల లోతులోకి వాహనం పడిపోయింది. హై ఆల్టిట్యూడ్ పోస్టు వద్దకు వెళుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. వెంటనే ఆర్మీతో పాటు పోలీసులు సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడినవారిని ఉదంపూర్ మిలిటరీ ఆసుపత్రికి తరలించారు.



## జులై నాటికి ఏపీలో శక్తిమంతమైన క్వాంటమ్ కంప్యూటర్..

### దావోస్ వేదికగా మంత్రి లోకేశ్ వెల్లడి

- ప్రపంచవ్యాప్తంగా క్వాంటమ్ నిపుణులకు తీవ్ర కొరత ఉందని వెల్లడించిన మంత్రి లోకేశ్
- అమరావతిని క్వాంటమ్ హబ్‌గా మార్చి, కంప్యూటర్ల తయారీ, ఎగుమతే లక్ష్యమన్న లోకేశ్
- ఏపీలో సెంటర్ ఫర్ ఫోర్త్ ఇండస్ట్రియల్ రెవల్యూషన్ (C4IR) ఏర్పాటుకు చర్యలు
- ఇంధన పరివర్తన, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో ఏపీకి డబ్ల్యూఈఎఫ్ సహకారం

పెన్ పవర్ డెస్క్:క్వాంటమ్ కంప్యూటింగ్ రంగంలో ఆంధ్రప్రదే శ్ కీలక ముందడుగు వేయనుందని, 2026 జులై

- మిగతా 2లో...

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న పవన్...

### శివరాత్రికి ముందే కోటప్పకొండ కొత్త రోడ్డు ప్రారంభం

- కోటప్పకొండ - కొత్తపాలెం రోడ్డును ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- రూ.3.9 కోట్ల పంచాయతీరాజ్ నిధులతో 8 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం
- శివరాత్రికి ముందే రోడ్డు పూర్తి చేస్తామన్న హామీని నెరవేర్చిన పవన్
- లక్షన్నర మంది భక్తులతో పాటు స్థానిక రైతులకు, విద్యార్థులకు ప్రయోజనం
- గిరిప్రదక్షణ మార్గం నమూనా, జింకల పార్కును పరిశీలించిన డిప్యూటీ సీఎం

- మిగతా 2లో...



## దావోస్ పర్యటన ముగించుకుని స్వదేశానికి బయల్దేరిన ముఖ్యమంత్రి చంద్రబాబు

- నాలుగు రోజుల దావోస్ పర్యటన ముగించుకున్న సీఎం చంద్రబాబు
- పర్యటన ద్వారా రాష్ట్రానికి రూ.2.50 లక్షల కోట్ల పెట్టుబడులు సాకారమయ్యాయని వెల్లడి
- గూగుల్, ఐబీఎం సీఈఓలు, లక్ష్మీ మిట్టల్ సహా 16 మంది పారిశ్రామికవేత్తలతో సమావేశం
- ఉదయం హైదరాబాద్‌కు చేరుకుని, అమరావతిలో విధుల్లో పాల్గొననున్న సీఎం
- ప్రపంచ సంస్థలు భారత్ వైపు చూస్తున్నాయని, ఇది శుభపరిణామమని వ్యాఖ్య

- మిగతా 2లో...



## ఎడిటర్ వ్యూ

# జనతా పార్టీ ఆవిర్భావ నేపథ్యం

49 ఏళ్ళ క్రితం ఇదే రోజున అంటే 1977 జనవరి 23న 'జనసంఘ్', 'భారతీయ లోక్‌దళ్', కాంగ్రెస్ (ఓ), 'స్వతంత్ర పార్టీ', 'సోషలిస్టు పార్టీ'లు కలిసి నేటి భారతీయ జనతా పార్టీ పూర్వపు భాగస్వామియైన 'జనతాపార్టీ'గా ఏర్పడ్డాయి. ఈ నేపథ్యాన్ని పరిశీలిస్తే.. 1951 అక్టోబర్ 21న ఢిల్లీలో శ్యాంప్రసాద్ ముఖర్జీ భారతీయ జనసంఘ్ పార్టీని ఏర్పాటు చేశాడు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ భావనలపై ఏర్పాటు చేసిన ఈ పార్టీకి ఎన్నికల చిహ్నంగా దీపం గుర్తు లభించింది. 1952లో జరిగిన పార్లమెంటు ఎన్నికలలో ఈ పార్టీకి 3 లోక్‌సభ స్థానాలు లభించాయి. అందులో ఒక స్థానం పార్టీ స్థాపకుడైన శ్యాంప్రసాద్ ముఖర్జీ విజయం సాధించింది. 1967 తరువాత ఈ పార్టీ బలపడింది. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ భావనలపై ఆధారపడిన పార్టీ కావడంతో ఈ పార్టీ హిందూ జాతీయవాద లక్షణాలను కలిగిఉంది. ఈ పార్టీలో ప్రముఖ స్థానాలను కలిగిన నాయకులు కూడా ఆర్.ఎస్.ఎస్ కార్యకర్తలే. 1964లో ఏర్పడిన విశ్వ హిందూ పరిషత్తు ఈ పార్టీకి సన్నిహితంగా ఉంది. జవహర్ లాల్ నెహ్రూ కాలంలో ఆయన సోషలిస్టు భావనలకు విసుగు చెందిన పలు భారతీయ జాతీయ కాంగ్రెస్ నేతలు ఈ పార్టీ పట్ల ఆకర్షితులయ్యారు. రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలలో ఈ పార్టీ ఉనికి నిలుపుకుంది. 1975లో దేశంలో ఇందిరా గాంధీ ప్రభుత్వం అత్యవసర పరిస్థితి విధించడంతో విపక్షాలకు చెందిన పలు నేతలను ఎలాంటి కారణం లేకుండానే జైళ్ళకు తరలించారు. అదే కాలంలో భారతీయ జనసంఘ్ ప్రముఖ నేతలు కూడా జైలుజీవితం గడిపారు. 1977లో అత్యవసర పరిస్థితిని తొలిగించి ఎన్నికలు జరుపడంతో దేశంలో మారిన రాజకీయ సమీకరణాల వలన భారతీయ జనసంఘ్‌తో పాటు భారతీయ లోక్‌దళ్, కాంగ్రెస్ (ఓ), సోషలిస్ట్ పార్టీలు కలిసి ఉమ్మడిగా జనతా పార్టీని ఏర్పాటు చేసుకున్నాయి. 1951లో శ్యాంప్రసాద్ ముఖర్జీ చే స్థాపించబడిన జనసంఘ్ 1977లో జనతా పార్టీలో విలీనం చేయబడింది. ఎన్నికలలో ఈ పార్టీ విజయం సాధించడంతో భారతదేశంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన తొలి కాంగ్రెసేతర ప్రభుత్వంగా జనతా ప్రభుత్వం పేరు సంపాదించింది. మురార్జీ దేశాయ్ నేతృత్వం వహించిన జనతా ప్రభుత్వంలో పూర్వపు జనసంఘ్ నేతలైన అటల్ బిహారీ వాజపేయికి విదేశాంగ మంత్రిత్వ శాఖ లభించగా, లాల్ కృష్ణ అద్వానీకి సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ లభించింది. జనతా ప్రభుత్వం విచ్ఛిన్నం కావడంతో 1980 లోక్‌సభ ఎన్నికల ముందు జనసంఘ నేతలు జనతా పార్టీ నుండి బయటకు వచ్చి భారతీయ జనతా పార్టీ పేరుతో ఎప్రిల్ 6న కొత్త రాజకీయ పార్టీని స్థాపించారు. ప్రస్తుతం భారతీయ జనతా పార్టీ భారతదేశంలో ప్రముఖ జాతీయ రాజకీయ పార్టీలలో ఒకటి. రాజకీయ కురు పితామహుడు అటల్ బిహారీ వాజపేయి భారతీయ జనతా పార్టీకి తొలి అధ్యక్షుడిగా పనిచేశారు. 1980లో ప్రారంభించిన ఈ పార్టీ దేశములోని హిందూ అధికసంఖ్యాక వర్గం యొక్క మత సాంఘిక, సాంస్కృతిక విలువల పరిరక్షణను ధ్యేయంగా చెప్పుకుంటుంది. సాంప్రదాయ సాంఘిక నియమాలు, దృఢమైన జాతీయ రక్షణ దీని భావ జాలాలు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రధానపాత్ర పోషిస్తున్న సంఘ్ పరివార్ కుటుంబానికి చెందిన వివిధ రకాల హిందూ జాతీయవాద సంస్థలు భారతీయ జనతా పార్టీకి కార్యకర్తల స్థాయిలో గట్టి మద్దతు ఇస్తున్నాయి. 1989 తరువాత ఈ పార్టీ బలపడింది. అటల్ బిహారీ వాజపేయి 3 సార్లు ప్రధానమంత్రి పదవిని కూడా చేపట్టినారు. భాజపా, అనేక ఇతర పార్టీల మద్దతుతో 1999 నుండి 2004 వరకు భారతదేశ ప్రభుత్వము భారత కేంద్ర ప్రభుత్వాన్ని పాలించింది. దాని సీనియర్ నాయకులైన అటల్ బిహారీ వాజపేయి ప్రధాని గాను, లాల్ కృష్ణ అద్వానీ ఉప ప్రధాన మంత్రి గానూ పనిచేశారు. జాతీయ ప్రజాస్వామ్య కూటమిలో ప్రధాన పార్టీ అయిన భాజపా, భారత పార్లమెంటులో ప్రధాన ప్రతిపక్షముగా 2014 మే వరకు కొనసాగింది. సార్వత్రిక ఎన్నికలలో లోక్ సభ లోని 543 స్థానాలకు మునుపెన్నడూ లేనన్ని 281 స్థానాలు గెలుచుకున్న భాజపా (మిత్ర పక్షాలతో కలిసి జాతీయ ప్రజాస్వామ్య కూటమికి 337 స్థానాలు) నరేంద్ర మోడీ నాయకత్వంలో అధికారం చేబట్టింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో లోక్ సభ ఎన్నికల్లో 303 స్థానాల్లో విజయం సాధించింది. 2024 ఎన్నికల్లో 543 స్థానాలలో అధికారంలో ఉన్న ఎన్‌డీఏ కూటమి 293 స్థానాలతో మెజారిటీ సాధించింది. ఇందులో బీజేపీ పార్టీ స్వంతంగా గెలుచుకున్న 240 సీట్లు ఉన్నాయి, ప్రతిపక్ష ఇండియా కూటమికి 234 సీట్లు వచ్చాయి, ఇందులో కాంగ్రెస్ పార్టీకి స్వంతంగా గెలుచుకున్న 99 స్థానాలు ఉన్నాయి. 2024 జూన్ 9న, భారతీయ జనతా పార్టీ మెజారిటీని కోల్పోయినప్పటికీ, జాతీయ ప్రజాస్వామ్య కూటమికి నాయకుడిగా ఎన్నికై, ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ ప్రమాణ స్వీకారం చేశారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో మళ్లీ అధికారం చేపట్టింది. ప్రస్తుతం మూడవ సారి నరేంద్ర మోడీ ప్రధానిగా ప్రభుత్వంగా కొనసాగుతున్నది.

# దావోస్ వేదికగా ఆసక్తికర భేటీ... రేవంత్ రెడ్డిని కలిసిన నారా లోకేశ్

స్విట్జర్లాండ్‌లోని దావోస్ వేదికగా తెలుగు రాష్ట్రాల నేతల మధ్య స్నేహపూర్వక భేటీ జరిగింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరు రాష్ట్రాల అభివృద్ధి, ప్రగతి ప్రణాళికలపై ఇరువురు నేతలు ఫలవంతమైన చర్చలు జరిపారు. పరస్పర సహకారంతోనే తెలుగు రాష్ట్రాల సమగ్రాభివృద్ధి సాధ్యమని ఇద్దరూ ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో భాగంగా మంత్రి నారా లోకేశ్... సీఎం రేవంత్ రెడ్డిని మంగళగిరి శాలువాతో సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు. ప్రతిగా సీఎం రేవంత్ రెడ్డి కూడా లోకేశ్ ను సత్కరించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో చేపడుతున్న విద్యా సంస్కరణలు, ఐటీ రంగంలో సాధిస్తున్న ప్రగతిని లోకేశ్ ముఖ్యమంత్రికి వివరించారు. ముఖ్యంగా 'ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్' కోసం తీసుకుంటున్న చర్యలు, వాటి ద్వారా వస్తున్న సానుకూల ఫలితాల గురించి చర్చించారు. దీనిపై స్పందించిన రేవంత్ రెడ్డి, తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి తెలిపారు. ముఖ్యంగా, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా టాటా సంస్థ సహకారంతో తెలంగాణలోని ఐటీఐలను ఆధునిక స్కిల్ క్యాంపస్‌లుగా తీర్చిదిద్దామని రేవంత్ రెడ్డి వివరించారు. ఈ క్యాంపస్‌లను సందర్శించి, అక్కడ అమలవుతున్న కార్యక్రమాలను పరిశీలించాలని లోకేశ్ ను ఆయన ఆహ్వానించారు. అలాగే, కోట్లాది మంది భక్తులు దర్శించుకునే మేడారం సమ్మక్క-సారలమ్మ దేవస్థానాన్ని వందల కోట్ల రూపాయలతో ఆధునికీకరిస్తున్నామని తెలిపారు. దశాబ్దాలుగా ఏ ప్రభుత్వం చూపని చొరవతో రహదారులు, మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, తప్పకుండా వనదేవతలను దర్శించుకోవాలని లోకేష్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారు.

పెట్టుబడుల సాధనలో తెలుగు రాష్ట్రాలు పరస్పరం పోటీపడుతూనే, అభివృద్ధి విషయంలో సహకరించుకోవాలని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు. ఈ స్ఫూర్తితో ముందుకెళితే దేశానికే తెలుగు రాష్ట్రాలు ఆదర్శంగా నిలుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న పవన్...

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కల్యాణ్ కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి భక్తులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. శివరాత్రి ఉత్సవాలలోపు రహదారి సౌకర్యం కల్పిస్తామన్న హామీని నెరవేరుస్తూ... కోటప్పకొండ - కొత్తపాలెం గ్రామాల మధ్య నిర్మించిన నూతన రహదారిని గురువారం ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. రూ.3.9 కోట్ల పంచాయతీరాజ్ నిధులతో 8 కిలోమీటర్ల మేర ఈ రోడ్డును నిర్మించారు.

కోటప్పకొండ క్షేత్ర దర్శనం అనంతరం కొండ దిగువన ఉన్న శివస్థూపం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని పవన్ కల్యాణ్ ఆవిష్కరించారు. ఆ తర్వాత రోడ్డుపై కొంత దూరం నడిచి, నిర్మాణ నాణ్యతను స్వయంగా పరిశీలించారు. గత అసెంబ్లీ సమావేశాల సందర్భంగా, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ అరవింద్ బాబు ఈ రోడ్డు ఆవశ్యకతను పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. భక్తుల ఇబ్బందులను తొలగించేందుకు ఈ రహదారి నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన పవన్, శివరాత్రి నాటికి రోడ్డును పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ నూతన రహదారితో మహాశివరాత్రి ఉత్సవాలకు తరలివచ్చే సుమారు లక్షన్నర మంది భక్తుల ప్రయాణ కష్టాలు తీరనున్నాయి. అంతేకాకుండా, కొత్తపాలెం గ్రామ పరిసరాల్లోని రైతులకు వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు, గోనేపూడి పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు కూడా ఈ రోడ్డు ఎంతగానో ఉపయోగపడనుంది. రోడ్డు ప్రారంభోత్సవం సందర్భంగా గోనేపూడి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు పవన్ కల్యాణ్‌ను కలిసి, తమ కోసం రహదారి నిర్మించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తమ పాఠశాలకు క్రీడా మైదానంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రం సమర్పించారు. ఈ పర్యటనలో భాగంగా పవన్ కల్యాణ్.. కోటప్పకొండలో చేపట్టనున్న గిరిప్రదక్షిణ మార్గం నమూనా లేఅవుట్‌తో పాటు, జింకల పార్కును కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు, జనసేన నరసరావుపేట ఇన్‌ఛార్జ్ సయ్యద్ జిలాని, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఇతర అధికారులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

# దావోస్ పర్యటన ముగించుకుని స్వదేశానికి బయల్దేరిన ముఖ్యమంత్రి చంద్రబాబు

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో తన నాలుగు రోజుల పర్యటనను విజయవంతంగా ముగించుకుని స్వదేశానికి బయల్దేరారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో పాల్గొన్న ఆయన, శుక్రవారం ఉదయం 8:25 గంటలకు హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా అమరావతికి పయనమై, ఉదయం 11:30 గంటల నుంచి సచివాలయంలో అధికారిక విధుల్లో పాల్గొననున్నారు. ఈ పర్యటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అత్యంత ఫలవంతంగా సాగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. కేవలం మూడు రోజుల సమావేశాల ద్వారానే గ్రీన్ ఎనర్జీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×), వ్యవసాయం, టూరిజం వంటి కీలక రంగాల్లో సుమారు రూ. 2.50 లక్షల కోట్ల పెట్టుబడులు సాకారమయ్యాయని ఆయన వివరించారు. ఈ రంగాల్లో ఆంధ్రప్రదేశ్ సాధిస్తున్న ప్రగతిని, అందుబాటులో ఉన్న వనరులను ప్రపంచ వేదికపై సమర్థంగా వివరించగలిగామని తెలిపారు. గతంతో పోల్చుకుంటే ప్రపంచ దిగ్గజ సంస్థలు ఇప్పుడు భారత్ వైపు ఎంతో ఆసక్తిగా చూస్తున్నాయని, దేశంలోని యువశక్తి, సమర్థ నాయకత్వం, సానుకూల పాలసీలే ఇందుకు కారణమని ఆయన విశ్లేషించారు. తన పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు మొత్తం 36కు పైగా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆర్సెలర్ మిట్టల్ చైర్మన్ లక్ష్మీ మిట్టల్, గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్, ఐబీఎం సీఈఓ అర్వింద్ కృష్ణ వంటి 16 మందికి పైగా దిగ్గజ పారిశ్రామికవేత్తలతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇజ్రాయెల్, యూఏఈ, స్విట్జర్లాండ్ దేశాల ప్రతినిధులతోనూ భేటీ అయ్యారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం నిర్వహించిన 9కి పైగా సెషన్లలో పాల్గొని, ప్రపంచ పారిశ్రామిక రంగంలోని తాజా పోకడలను, పారిశ్రామికవేత్తల ఆలోచనలను తెలుసుకున్నారు. ఈ సదస్సు 'బ్రాండ్ ఆంధ్రప్రదేశ్ను ప్రపంచానికి మరింత చేరువ చేసేందుకు, రాష్ట్రంలో అమలు చేస్తున్న విధానాలను అంచనా వేసేందుకు ఎంతగానో దోహదపడిందని ఆయన పేర్కొన్నారు. పర్యటనలో భాగంగా యూరప్‌లోని తెలుగు ప్రజలతోనూ చంద్రబాబు మమేకమయ్యారు. తెలుగు డయాస్పోరా కార్యక్రమంలో పాల్గొని వారిలో ఆత్మవిశ్వాసం నింపారు. దావోస్ వేదికగా పలు జాతీయ, అంతర్జాతీయ మీడియా సంస్థలకు ప్రత్యేక ఇంటర్వ్యూలు ఇచ్చి, రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలను, పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు.

# జులై నాటికి ఏపీలో శక్తిమంతమైన క్వాంటమ్ కంప్యూటర్..

- మొదటి పేజి తరువాయి

నాటికి దక్షిణాసియాలోనే అత్యంత శక్తివంతమైన క్వాంటమ్ కంప్యూటర్‌ను అమరావతిలో ఆవిష్కరించనున్నామని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక (ఔజుఖీ) సదస్సులో ఆయన పాల్గొన్నారు. "నైపుణ్యాలు, సహకారంతో క్వాంటమ్ ఆవిష్కరణలను వేగవంతం చేయడం" అనే అంశంపై జరిగిన చర్చాగోష్ఠిలో లోకేశ్ ప్రసంగించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్వాంటమ్ కంప్యూటింగ్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగమని తెలిపారు. 2024లో 1.3 బిలియన్ డాలర్లుగా ఉన్న ఈ మార్కెట్, 2030 నాటికి 41.8 శాతం వార్షిక సగటు వృద్ధి రేటుతో 20 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు వివరించారు. అయితే, ఈ రంగానికి అవసరమైన నిపుణుల్లో ప్రపంచవ్యాప్తంగా మూడింట ఒకవంతు మాత్రమే అందుబాటులో ఉన్నారని, ఈ నైపుణ్యాల అంతరాన్ని పూడ్చడంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని లోకేశ్ నొక్కిచెప్పారు.

**అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ**

ఐబీఎం, టీసీఎస్ భాగస్వామ్యంతో 133-క్విట్ హెరాన్ ప్రాసెసర్‌తో కూడిన ఐబీఎం క్వాంటమ్ సిస్టమ్ 2ను అమరావతిలో ఏర్పాటు చేయనున్నట్లు లోకేశ్ వెల్లడించారు. ఇది భారతదేశంలోనే తొలి డెడికేటెడ్ క్వాంటమ్ వ్యాలీ టెక్ పార్క్‌కు కేంద్రంగా ఉంటుందని తెలిపారు. 50 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న ఈ ఇన్నోవేషన్ జిల్లాలో అంతర్జాతీయ స్థాయి పరిశోధన కేంద్రాలు, ప్రముఖ కంపెనీలతో కలిసి పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు, 50 వేల మందికి పైగా శిక్షణ అందించే వ్యవస్థలను ఏర్పాటు చేస్తామన్నారు. 2026 జనవరి నాటికి 100 క్వాంటమ్ అల్గోరిథంలను, ఆగస్టు 15 నాటికి 100 క్వాంటమ్ వినియోగ కేసులను పరీక్షించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. అమరావతి నుంచి క్వాంటమ్ కంప్యూటర్లను తయారు చేసి, ప్రపంచానికి ఎగుమతి చేయాలనే స్పష్టమైన లక్ష్యంతో ముందుకెళుతున్నట్లు లోకేశ్ పేర్కొన్నారు.

**మూడంచెల నైపుణ్యాభివృద్ధి ప్రణాళిక**

క్వాంటమ్ రంగంలో నైపుణ్యాల కొరతను అధిగమించేందుకు ఏపీ ప్రభుత్వం మూడంచెల వ్యూహాన్ని అమలు చేయనుందని లోకేశ్ వివరించారు. తొలి దశలో 10 లక్షల మందికి క్వాంటమ్ అక్షరాస్యత కల్పించడం, రెండో దశలో పరిశ్రమలకు అవసరమైన నిపుణులను తయారు చేయడం, మూడో దశలో పరిశోధనలు, ఆవిష్కరణలను ప్రోత్సహించడం ద్వారా లక్ష మంది డెవలపర్లను సిద్ధం చేస్తామని తెలిపారు. భారత ప్రభుత్వం కూడా 'నేషనల్ క్వాంటమ్ మిషన్' ద్వారా రూ. 6,000 కోట్లతో ఈ రంగాన్ని ప్రోత్సహిస్తోందని గుర్తుచేశారు.

**ఏపీలో డబ్ల్యూఈఎఫ్ సెంటర్**

దావోస్ పర్యటనలో భాగంగా మంత్రి లోకేశ్, వరల్డ్ ఎకనమిక్ ఫోరం గవర్నమెంట్ ఎఫైర్స్ హెడ్ మరూన్ ఖైరౌజ్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఏడాదిలోగా ఏపీలో డబ్ల్యూఈఎఫ్-సీ4ఐఆర్ (సెంటర్ ఫర్ ఫోర్త్ ఇండస్ట్రియల్ రెవల్యూషన్)ను కార్యాచరణలోకి తీసుకురావడంపై చర్చించారు. ఇంధన పరివర్తన, సైబర్ సెక్యూరిటీ, సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలపై ఈ కేంద్రం దృష్టి సారిస్తుంది. గత ఏడాది నవంబర్‌లో ఏపీ ప్రభుత్వం, డబ్ల్యూఈఎఫ్ మధ్య కుదిరిన ఒప్పందం మేరకు సాధ్యమైనంత త్వరగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని ఖైరౌజ్ హామీ ఇచ్చారు. ఈ ప్రయత్నాలన్నీ ఫలించి, చర్చలు వాస్తవ పెట్టుబడులుగా మారాలని ఆశిస్తున్నట్లు మంత్రి లోకేశ్ తన ప్రసంగంలో పేర్కొన్నారు.

# ఆ కోటరీని నమ్మితే జగన్ ఎప్పటికీ అధికారంలోకి రాలేరు

- మొదటి పేజి తరువాయి

విచారణలో భాగంగా ఈడీ అధికారులు తనను ప్రశ్నించారని, అయితే అసలు ఏపీలో లిక్కర్ స్కామ్ జరిగిందని తాను భావించడం లేదని అధికారులకు చెప్పినట్లు వెల్లడించారు. మిథున్ రెడ్డి కోరిక మేరకు శ్రీధర్ రెడ్డి కంపెనీకి సిఫారసు చేసిన మాట వాస్తవమేనని, కానీ రూ.100 కోట్లు ఏర్పాటు చేయాలని జగన్ తనతో ఎన్నడూ చెప్పలేదని ఆయన కుండబద్దలు కొట్టారు. ఈ సందర్భంగా జగన్ చుట్టూ ఉన్న కోటరీపై విజయసాయి రెడ్డి తీవ్ర ఆగ్రహం, ఆవేదన వ్యక్తం చేశారు. "జగన్ చుట్టూ ఉన్న కోటరీ పెట్టే వేధింపులు, అవమానాలు తట్టుకోలేకపోయాను. ఆ కోటరీయే నన్ను పొగబెట్టి నెమ్మదిగా పార్టీ నుంచి బయటకు పంపించింది. కోటరీలోని కొందరు ఇప్పటికీ తింటూనే ఉన్నారు. జగన్ జైలులో ఉన్నప్పుడు పార్టీని అంటిపెట్టుకుని ఉన్న నాకు ఇప్పుడు గౌరవం లేకుండా పోయింది. ఈ కోటరీ మాటలు నమ్మడం కొనసాగిస్తే జగన్ ఎప్పటికీ అధికారంలోకి రాలేరు" అని ఘాటుగా విమర్శించారు. తాను 'నంబర్ 2' అనే మాట వాస్తవమేనని, కానీ, కేవలం తనపై కేసులు వచ్చినప్పుడు, వాటిని ఎదుర్కోవడానికి మాత్రమే తనను నంబర్ 2గా ప్రచారం చేశారని వాపోయారు. కానీ లాభాలు పంచుకోవడంలో మాత్రం తన స్థానం వంద తర్వాతనే అని అన్నారు. ఇక 'ప్రలోభాలకు లొంగిపోయారు' అంటూ జగన్ చేసిన వ్యాఖ్యలు తనను తీవ్రంగా బాధించాయని, ఆ వ్యాఖ్యలను జగన్ వెనక్కి తీసుకుంటేనే తదుపరి ఆలోచన ఉంటుందని షరతు విధించారు. టీడీపీ కూటమిని విడగొడితేనే జగన్‌కు మళ్లీ అవకాశం ఉంటుందని రాజకీయ విశ్లేషణ చేశారు. తనకు విశాఖలో ఒక అపార్ట్‌మెంట్ తప్ప మరేమీ లేదని, ఏడాదిగా వ్యవసాయం చేసుకుంటున్నానని, సంబంధం లేని విషయాల్లో తనను ఇరికించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విజయసాయి రెడ్డి వ్యాఖ్యలు ప్రస్తుతం ఏపీ రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.

# టీవీకే పార్టీకి విజిల్ గుర్తు... ప్రవీణ్ చక్రవర్తి వ్యాఖ్యలతో కాంగ్రెస్ లో కలకలం!

**విజయ్ పార్టీకి విజిల్ గుర్తు కేటాయింపుపై కాంగ్రెస్ నేత హర్షం**

**ప్రవీణ్ చక్రవర్తి సోషల్ మీడియా పోస్ట్**

**డీఎంకేతో పొత్తు కొనసాగుతుందని కాంగ్రెస్ అధిష్ఠానం స్పష్టం**

**గతంలోనూ విజయ్‌తో ప్రవీణ్ భేటీ కావడంపై కొనసాగుతున్న చర్చ**

**నేతల వ్యాఖ్యలతో డీఎంకే-కాంగ్రెస్ కూటమిలో గందరగోళ పరిస్థితులు**



కాంగ్రెస్ పార్టీకి సొంత నేతలతోనే తల పోట్లు కొత్తేమీ కాదు. జాతీయ స్థాయిలో శశిథరూర్ వంటి వారు కాంగ్రెస్ వ్యతిరేక గళం వినిపిస్తుండడం తెలిసిందే. రాష్ట్రాల స్థాయిలోనూ కొందరు కాంగ్రెస్ అసమ్మతివాదులు ఉన్నారు. అలాంటివారిలో తమిళనాడు నేత ప్రవీణ్ చక్రవర్తి ఒకరు. ఆయన కాంగ్రెస్ లో ఉన్నప్పటికీ, దాదాపు ప్రతి విషయంలోనూ 'పార్టీ లైన్'కు ఆవలేఉంటారు. తాజాగా, విజయ్ టీవీకే పార్టీకి ఎన్నికల సంఘం విజిల్ గుర్తును కేటాయిస్తే.. ఈయన హర్షం వ్యక్తం చేశారు. అధికార డీఎంకేతో కాంగ్రెస్ పొత్తులో ఉండగా... డీఎంకే వ్యతిరేకి అయిన విజయ్ కు ప్రవీణ్ చక్రవర్తి మద్దతు పలకడడం తమిళనాడు కాంగ్రెస్ నాయకత్వానికి మింగుడుపడడంలేదు. అధికార డీఎంకే కూటమితోనే కలిసి ప్రయాణించాలని కాంగ్రెస్ అధిష్ఠానం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ, ఆయన మాత్రం నటుడు విజయ్ స్థాపించిన కొత్త పార్టీకి అనుకూలంగా సంకేతాలు పంపుతూ కలకలం రేపుతున్నారు. నటుడు విజయ్ స్థాపించిన 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పార్టీకి 2026 అసెంబ్లీ ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం 'విజిల్' గుర్తును కేటాయించింది. ఈ ప్రకటన వచ్చిన వెంటనే టీవీకే మద్దతుదారులతో కలిసి ప్రవీణ్ చక్రవర్తి తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. "2026 తమిళనాడు ఎన్నికలకు విజిల్ ఊదేశారు. అన్ని రాజకీయ పార్టీలు సిద్ధంగా ఉన్నాయి" అని ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. ఈ వ్యాఖ్యలు డీఎంకే-కాంగ్రెస్ కూటమిలో చర్చనీయాంశంగా మారాయి. డీఎంకే ప్రభుత్వం, సీఎం స్టాలిన్‌పై విజయ్ విమర్శలు చేస్తున్నప్పటికీ, ప్రవీణ్ ఆయనకు మద్దతుగా నిలవడం ఇది తొలిసారి కాదు. ఇటీవల చెన్నైలోని టీవీకే కార్యాలయంలో విజయ్‌తో ప్రవీణ్ చక్రవర్తి ఏకాంతంగా సమావేశం కావడం రాజకీయంగా ఊహాగానాలకు తెరలేపింది. పొత్తుల విషయంలో గందరగోళం సృష్టించవద్దని రాహుల్ గాంధీ సహా కాంగ్రెస్ పెద్దలు స్పష్టంగా చెప్పినప్పటికీ ఈ పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం. ఈ వివాదంపై తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షుడు కే. సెల్వపెరుంతగై స్పందిస్తూ, పార్టీ పూర్తిగా ఏఐసీసీ ఆదేశాలకు కట్టుబడి ఉందని, పొత్తుల విషయంలో అనవసర గందరగోళం సృష్టించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కాగా, ఈ విజిల్ గుర్తును గతంలో 2019లో కర్ణాటకలో ప్రకాశ్ రాజ్, 2021లో తమిళనాడులో నటుడు మయిల్ సామి స్వతంత్ర అభ్యర్థులుగా ఉపయోగించుకున్నారు.

# విద్యార్థులు తరగతి గదిలకే పరిమితం కారాదు





* ఆంధ్ర విశ్వవిద్యాలయం గౌరవ ప్రొఫెసర్ జయంతి విజయ రత్న
* ఆదర్శ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో పిల్ కార్యక్రమం

**గోకవరం, పెన్ పవర్ జనవరి 22:**"విద్యార్థులు తరగతి గదులకే పరిమితం కాకుండా పరిశోధన, ఆవిష్కరణలు, ఆలోచనా విప్లవం దిశగా ముందుకు సాగాలి" అని ఆంధ్ర విశ్వవిద్యాలయం కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ గౌరవ ప్రొఫెసర్ జయంతి విజయరత్న పిలుపునిచ్చారు. ఫార్మసీ విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు, పరిశోధన దృక్పథం, ఆవిష్కరణలపై ఆసక్తిని పెంపొందించే ఉద్దేశ్యంతో గోకవరం మండలం కొత్తపల్లి లో గల ఆదర్శ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫార్మసీ ఆవిష్కరణల అభ్యాస కార్యక్రమాన్ని ప్రొఫెసర్ జయంతి విజయరత్న ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయంతి విజయరత్న మాట్లాడుతూ విద్యార్థులు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ప్రాయోగిక నైపుణ్యాలు, సృజనాత్మక సామర్థ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ లయన్ కనకరాజు, ప్రిన్సిపాల్ డా. ఎం. త్రినాధరావు, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్. సుజని, కార్యక్రమ సమన్వయకర్త పి. శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అకాడమియాపరిశ్రమ మధ్య గ్యాప్ తగ్గించడంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని కళాశాల యాజమాన్యం తెలిపింది. ఫార్మకాలజీ ల్యాబ్×××ను ప్రముఖ ఫార్మసీ విద్యావేత్త ప్రొఫెసర్ కె. కె. ఆచార్జీ పేరుతో నామకరణం చేసి ప్రారంభించారు. ఫార్మ్.డి విద్యార్థులకు ప్రత్యేక కెరీర్ మార్గదర్శక సెషన్ నిర్వహించి, క్లినికల్ ఫార్మసీ రంగంలోని అవకాశాలు, వృత్తి బాధ్యతలు, భవిష్యత్ అవకాశాలపై అవగాహన కల్పించారు. మధ్యాహ్నం "విద్య నుంచి నాయకత్వం వరకు మహిళా ఫార్మసిస్టుల సాధికారత" అనే అంశంపై సదస్సు నిర్వహించారు.

ముఖ్య అతిథి ప్రొఫెసర్ జయంతి విజయ రత్న ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ పైడి రాజు ,డాక్టర్ గణేష్ ,ప్రేమ్, పవన్, దీప్తి, సత్య కళ ,అలేఖ్య ,విజయ, శిరీష, స్వర్ణ ,దుర్గ భవాని ,క్రాంతి విద్యార్థులు, కళాశాల యాజమాన్యం పాల్గొన్నారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# గందరగోళంగా సచివాలయాల ప్రారంభోత్సవాలు..



**కూనవరం,పెన్ పవర్,జనవరి 22.**గత ప్రభుత్వ హయాంలో నిర్మాణాలు పూర్తి అయిన గ్రామ సచివాలయాలను ప్రారంభోత్సవం చేయడం,ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు అయిన సర్పంచులు,ఎంపీటీసీలు,ఎంపీపీలు,జెడ్పీటీసీ,వార్డు సభ్యులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా స్థానిక ఎమ్మెల్యే శిరీషా దేవి చేత ప్రారంభించడం స్థానికంగా గందరగోళ పరిస్థితి సృష్టించడమేనని సీపీఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలా కార్యాలయాలకు ప్రారంభోత్సవాలు జరిపి,స్థానిక ప్రజలు రెండు సంవత్సరాలు గడిచిన తరుణంలో సమస్యలు వినిపించాలని ఎదురుచూసిన ప్రజలకు నిరాశ మిగిలిందని అన్నారు. స్థానిక సర్పంచులు, ఎంపీటీసీలు,ప్రజా సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళాం అనుకున్న అవకాశం లేకుండా చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేసారు. ప్రజాప్రతి నిధులకు సైతం సమాచారం ఇవ్వని అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. ముంపు మండలాల ప్రజల సమస్యలు ఎమ్మెల్యే కు పట్టనట్టు కార్యక్రమాన్ని ముగించారని ఆయన అన్నారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాలలో టీడీపీ జండాలు ఎలా కడతారని ఆయన ప్రశ్నించారు. అవి ప్రభుత్వ కార్యాలయాలా? లేక పార్టీ కార్యాలయాల అని ప్రశ్నించారు. సీపీఎం పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మేకల నాగేశ్వరావు,పాయం సీతారామయ్య,మడకం నాగమణి,మండల కమిటీ సభ్యులు ఆవుల ఉపేంద్ర, కర్నాటి శ్రీనివాసరావు, తాళ్లూరి శ్రీనివాసరావు,బొగ్గా సుబ్బయ్య,ఎంపీటీసీ ధర్మ ల అమ్మాజీ,పార్టీ సభ్యులు భారతి తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన బిడ్డకు జాతీయస్థాయిలో అరుదైన గౌరవం

* రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయస్థాయిలోగుర్తింపు
* చింతూరు డివిజన్,కు మంచిపేరు తెచ్చినలక్ష్మికుమారి



**వి.ఆర్.పురం పెన్.పవర్.జనవరి.22**

మండలంలోని ధర్మతాళ్ళగూడెం గ్రామానికిచెందిన సున్నంరాజు భార్య లక్ష్మికుమారి,తమ గ్రామానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చారు. గిరిజన ప్రాంతానికి చెందిన అంగన్వాడీ వర్కర్ జాతీయస్థాయిలోగుర్తింపు పొందడం తో చింతూరు డివిజన్,కు మంచిపేరు వచ్చింది. వడ్డిగూ డెం గ్రామంలో పులి లక్ష్మి కుమారి,వడ్డీగూడెం1అంగ న్వాడీ సెంటర్‌లో వర్కర్‌గా పనిచేస్తూ,ఉత్తమ సేవలకు గాను 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ స్థాయి ఉత్తమ సేవ పతకంకు ఎంపికయ్యారు. కూనవరం ప్రాజెక్ట్ పరిధిలో నుంచి జాతీయ అవార్డుకు ఎంపికైన లక్ష్మికుమారి,రిపబ్లిక్ డే వేడుకలలో భాగంగా ఎర్రకోట, ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి చేతుల మీదుగా ఈ గౌరవాన్ని అందుకోనున్నారు. గిరిజన మహిళగా గ్రామీ ణ ప్రాంతంలో పనిచేస్తూ జాతీయస్థాయికు ఎదగ డంతో మహిళలకు ఆదర్శంగా నిలిచారు. లక్ష్మికుమారి తన అంకి తభావంతో అన్ని ఆన్‌లైన్ వర్క్ల నిర్వహణ, స్కూల్ వా తావరణ అభివృద్ధి, ప్రీస్కూల్ యాక్టివిటీస్,టీ యల్. యం (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) సమర్థ వంత మైన వినియోగం వంటి అంశాలలో ప్రత్యేక ప్రతిభ చూపిం చారు. చిన్నారుల విద్య,ఆరోగ్యం,పోషణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ,తల్లిదండ్రులలోనూ అవగాహన పెంచడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. ఐ.సీ.డీ.ఎస్.సీడీపీఓ వి.మల్లిక (సి.డి.పి.ఓ)నాయోమి రాణి(సూపర్వైజర్) అంగన్వాడీ వర్కర్లు సూర్యాంబ,పద్మావతి,సుజాత,విజ యలక్ష్మి,లక్ష్మికుమారి కు శు భాకాంక్షలు తెలియజేస్తూ ఢిల్లీ కు వెళుతున్న లక్ష్మి కుమారి కు అల్,ది బెస్ట్, లక్ష్మికుమారి, హావ్ ఏ సేఫ్ జర్నీ అంటూ ఆమెకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ విజయం గిరిజన ప్రాంత అంగన్వాడీ వ్యవస్థకు, వి.ఆర్.పురం మండలానికి గర్వ కారణంగా నిలిచింది. గ్రా మీణ గిరిజన మహిళలు కృషి చేస్తే జాతీయస్థాయిలో గుర్తింపు సాధించవచ్చని లక్ష్మి కుమారి మరోసారి నిరూపించారు.

# కేంద్రమంత్రి నిర్మల సీతారామన్ ను కలిసిన ఎంపీ, పొగాకు రైతులు.



**గోపాలపురం, పెన్ పవర్, జనవరి 22.** వర్జీనియా పొగాకు రైతులు, పొగాకు బోర్డ్ చైర్మన్ సిహెచ్ యశ్వంత్, రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుపాటి పురందేశ్వరి సహకారంతో కేంద్ర ఆర్థిక శాఖమంత్రి నిర్మల సీతారామన్ తెలిపారు. పొగాకు పంటకు సంబంధించిన పలు సమస్యలను వివరించి వినతిపత్రం సమర్పించినట్లు పొగాకు బోర్డు మాజీ ఉపాధ్యక్షులు మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన రైతుగద్దె శేషగిరిరావు గురువారం విలేకరులకు తెలిపారు. అంతర్జాతీయ వాణిజ్య పంట అయిన పొగాకు కు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర నష్టాన్ని సవిచూచే పరిస్థితి నెలకొంది అన్నారు. ఒకవైపు రోజురోజుకు పెరుగుతున్న పంట పెట్టుబడి మరోవైపు క్షీణిస్తున్న ధరలు రైతుల్ని మరింత ఇబ్బందుల్లోకి నెట్టుతున్నాయని వాపోయారు. పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని మంత్రిని కోరాము అన్నారు. ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని రైతులు పంటను సాగు చేస్తున్నారు అనే విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ముడి పొగాకు, సిగరెట్ ల పై ఎక్సైజ్ డ్యూటీ పెంపు వలన పొగాకు రైతులు ఆదాయం, ఎగుమతులు, పరిశ్రమలపై తీవ్ర ప్రభావం చూపించిందన్నారు. ఈ కారణాలవల్ల పొగాకు ధర పడిపోయే ప్రమాదం ఉందని అలాగే నకిలీ పొగాకు ఉత్పత్తుల వల్ల వర్జీనియా పొగాకు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారనే విషయాన్ని మంత్రికి వివరించామన్నారు. మంత్రి స్పందించి వర్జీనియా పొగాకు రైతుల జీవనోపాధి పరిరక్షణ, దేశీయ పరిశ్రమల తో పాటు ఎగుమతులను బలోపేతం చేయవలసిన అవసరం ఉందన్నారు. పొగాకు రంగానికి దీర్ఘకాలిక స్థిరత్వం కల్పించే దిశగా తగిన చర్యలు తీసుకోవాలని ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రానికి చెందిన రైతులు బోర్డు చైర్మన్ సిహెచ్ యశ్వంత్ తో కలిసి మంత్రిని కోరామన్నారు. ఈ సమస్యలపై మంత్రి నిర్మల సీతారామన్ సానుకూలంగా స్పందించినట్లు శేషగిరిరావు తెలిపారు.

# పైథాన్, ఎస్క్యూఎల్‌పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం



**పెన్ పవర్, ఉంగుటూరు, జనవరి 22** :నారాయణపురం శ్రీ అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం (కంప్యూటర్స్ అప్లికేషన్స్), బీఎస్సీ (కంప్యూటర్స్) విద్యార్థులకు పైథాన్ అడ్వాన్స్ ప్రోగ్రామింగ్ మరియు ఎస్క్యూఎల్‌పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఈ నెల 20వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే. వసుధ తెలిపారు.

ఈ శిక్షణ కార్యక్రమంలో విద్యార్థులకు పైథాన్ ప్రోగ్రామింగ్‌కు సంబంధించిన ఫండమెంటల్స్, బేసిక్ కాన్సెప్ట్‌లు, డేటా టైప్స్, వేరియబుల్స్, ఆపరేటర్లు, సింపుల్ డిసిషన్ మేకింగ్, ప్రాక్టికల్ ఉదాహరణలతో శిక్షణ అందిస్తున్నారు. సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకునేలా ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం క్వాంటం వ్యాలీగా అవతరించబోతున్న తరుణంలో, ఐటీ రంగంలో ఏర్పడే విస్తృత ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఈ శిక్షణ శిబిరం ఎంతో దోహదపడుతుందని ఆమె తెలిపారు.

ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన బ్లాక్ బక్స్ కంపెనీ సీనియర్ టెక్నికల్ ట్రైనర్ శ్రీమతి జి. కిరణ్మయి విద్యార్థులకు పైథాన్ ప్రోగ్రామింగ్‌లోని వివిధ అంశాలపై శిక్షణ అందించారు. ప్రాక్టికల్‌గా ప్రోగ్రామ్‌లు రాసే నైపుణ్యాన్ని కూడా విద్యార్థులు ఈ శిక్షణలో నేర్చుకుంటున్నారు.

ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా. బాబూరావు, డా. కొండా రవి, రెడ్డియ్య, డా. బి. వెంకటేశ్వర రెడ్డి, రాంమోహన్, లావణ్య, యషిత తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయాలను ప్రారంభించిన ఎమ్మెల్యే శిరీష దేవి...



* పోలవరం నిర్వాసితులకు అండగా ఉంటానన్న ఎమ్మెల్యే
* మీ సమస్య పరిష్కారానికై అసెంబ్లీలో గళ మెత్తుతా

**కూనవరం,పెన్ పవర్,జనవరి 22.**మండలంలో నెలకొల్పిన కూనవరం,కుటూరు,కొండ్రాజుపేట స్వర్ణ సచివాలయాలను,చిన్నార్కు ర్ హెల్త్ సబ్ సెంటర్,రైతు భరోసా కేంద్రాలను రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి ప్రారంభించారు. ఇటీవల మరణించిన పార్టీ కార్యకర్తలైన జగ్గవరం గ్రామానికి చెందిన కుంజ వీరబాబు కుటుంబాన్ని,ముల్లూరు గ్రామానికి చెందిన అచ్చే చిన్న సత్యనారాయణ కుటుంబాన్ని పరామర్శించి మీకు అండగా నేనున్నానని భరోసా ఇచ్చారు. అనంతరం టేకులబోరు సినిమా హాల్ నందు మండల అధ్యక్షుడు ఎడవల్లి భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే శిరీష దేవి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ మూలంగా నా నియోజకవర్గపు ప్రజలు సర్వం కోల్పోతున్నారని వారి త్యాగం మరువలేమని,వారికి ఎంత నష్టపరిహారం ఇచ్చినా తక్కువేనని అసెంబ్లీలో గళమెత్తి చాటానని,నా ప్రజలను ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరానని అన్నారు. మన ప్రభుత్వంలో ఏ ఒక్క నిర్వాసితుడు నష్టపోకూడదని అన్నారు. ఆర్ అండ్ ఆర్ లో పేరు రానివారు,ఇంటి స్ట్రక్చర్ వ్యాల్యూ బ్యాంకులో నమోదు కాని వారు ఎవరు ఆందోళన చెందవద్దని చెప్పారు. 18 సంవత్సరాల నిండిన యువతి,యువకులకు కూడా ప్యాకేజీకి అర్హులయ్యే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి ప్యాకేజీకి అర్హులయ్యే విధంగా చేస్తానని హామీ ఇచ్చారు. మండలంలో ఉన్న పార్టీ నాయకులు,కార్యకర్తలు,మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని పూలతో ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సోడే రామయ్య,నియోజకవర్గ అబ్జర్వర్ కొల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్, స్థానిక సర్పంచ్ హేమంత్ గాంధీ, మాజీ జెడ్పిటిసి కన్యకా పరమేశ్వరి, పోడియం అప్పారావు,చెలికాని ఉమా,బారపాటి ప్రకాష్,గడేసుల ప్రేమ్ చందు,ఇంటి భాస్కర్, తోటకూరి వెంకటేష్,గడ్డిపాటి ప్రసాద్,సోమక సత్యనారాయణ, హెచ్ రాము,ఎస్కే రసూల్,హెచ్ రవి,కారం రత్తయ్య,జనసేన మండల అధ్యక్షుడు దాసరి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.







# యువతకు ఉద్యోగ అవకాశాలు

## అంబుజా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా నైపుణ్య పరీక్ష

**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్ జనవరి 22:** యువతకు నేరుగా ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో అంబుజా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా నైపుణ్య పరీక్షను ఈ నెల 24వ తేదీ శనివారం రంపచోడవరం అంబుజా శిక్షణ కేంద్రంలో నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి వీర నాగ బాబు తెలిపారు. ఈ నైపుణ్య పరీక్ష ద్వారా ప్రముఖ సంస్థలైన టెక్ మహీంద్రా, డబ్ల్యూఎన్ఎస్, డైకిన్, డాజిల్ క్రీడా దుస్తుల తయారీ సంస్థ, బ్లూ స్టార్, కోజెంట్, బ్లూ ఓషన్ తదితర సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఆయన వెల్లడించారు. పరీక్షలో సమాచార సాంకేతిక విజ్ఞానం, వ్యక్తిత్వ నైపుణ్యాలు, మానసిక సామర్థ్యం, గణిత గణనలు అంశాలపై ప్రశ్నలు ఉంటాయని తెలిపారు. 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుకున్న అభ్యర్థులు ఈ పరీక్షకు అర్హులని, 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు కలిగిన యువత పాల్గొనవచ్చని వివరించారు. ఈ పరీక్ష ఉదయం 10 గంటలకు ఖచ్చితంగా ప్రారంభమవుతుందని, రంపచోడవరం లోని భాను సరఫరా కేంద్రం, సాయిబాబా ఆలయం ఎదురుగా ఉన్న అంబుజా ఫౌండేషన్ శిక్షణ కేంద్రం వేదికగా జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9701869742, 9494546366 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తు నిర్మాణానికి ముందడుగు వేయాలని అంబుజా ఫౌండేషన్ ప్రతినిధి వీర నాగ బాబు కోరారు.




# ఏలూరు గంగానమ్మ జాతర మహోత్సవాల్లో పూజలు చేసిన చింతమనేని దంపతులు



**ఏలూరు జనవరి 22 పెన్ పవర్ :** స్థానిక తూర్పువీధి గంగానమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా ఏలూరు తూర్పు వీధిలోని జాతర కమిటీ కన్వీనర్ వంకినేని భాను ప్రకాష్ ఇంటి వద్ద తూర్పువీధి శ్రీ గంగానమ్మ, శ్రీ ఆది మహాలక్ష్మమ్మ, శ్రీ వినుకొండ అంకమ్మ, శ్రీ పోతురాజు బాబుల ఘటాలకు జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో దెందులూరు ఎమ్మెల్యే శ్రీ చింతమనేని ప్రభాకర్ సతి సమేతంగా పాల్గొని అమ్మవారి ఘటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ శతాబ్ద కాలం పైగా ఏలూరు ప్రజల ఇలవేల్పుగా పూజలు అందుకుంటున్న ఏలూరు తూర్పువీధి గంగానమ్మ జాతరను అత్యంత వైభవోపేతంగా జాతర కమిటీ వారు నిర్వహించడం ఎంతో అభినందనీయమని, అమ్మవార్ల కరుణ కటాక్షాలు దెందులూరు నియోజకవర్గ మరియు ఏలూరు నియోజకవర్గ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని అమ్మవారిని కోరుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈనెల 25వ తేదీన జరగనున్న మహాకుంభం కార్యక్రమంలో ను, 26వ తేదీన చిత్ర విచిత్ర వేష ధారణలతో భారీ భక్త జన సందోహంతో జరగనున్న కొర్ల బండి ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొనడానికి ఇతర ప్రాంతాల నుంచి కూడా భారీ సంఖ్యలో భక్తులు తరలిరానున్న నేపథ్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జాతర కమిటీ కన్వీనర్లు, వాలంటీర్లు సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు.

# డిప్యూటీ మేయర్ పదవికి కర్రి శ్రీనివాసరావు ఎంపిక



**ఏలూరు జనవరి 22 పెన్ పవర్ :** ముందుగా జరిగిన ఒప్పందం ప్రకారం ఏలూరు నగరపాలక సంస్థ ఉప మేయర్ పదవికి 12వ డివిజన్ కార్పొరేటర్ కర్రి శ్రీనివాసరావుకు ఇవ్వడానికి నిర్ణయించినట్లు నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ ప్రకటించారు. గురువారం నగరపాలక మేయర్ చాంబర్లో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం వెలువడింది. ఈ సందర్భంగా ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య, నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పరంగా కార్పొరేటర్లు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని, కర్రీ శ్రీనివాసరావును ఉప మేయర్ గా నిర్ణయిస్తూ తీసుకున్న నిర్ణయం ప్రకారం త్వరలో ప్రక్రియ పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఏ. భాను ప్రతాప్ ను ఆదేశించినట్లు ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మేయర్ దంపతులు కర్రి శ్రీనివాసరావుకు పుష్పగుచ్చం ఇచ్చి శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో కర్రీ శ్రీనివాసరావు అభిమానులు, పలువురు కార్పొరేటర్లు, మహిళలు పాల్గొని ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు .

# అగ్ని ప్రమాదాల నివారణపై హెచ్పిసిఎల్ ఐఓసీఎల్ మాక్‌డ్రిల్



**సీతానగరం, పెన్ పవర్, జనవరి 22:** ప్రమాదాల నివారణ పై ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఐఓసీఎల్ హెచ్పిసిఎల్ తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మాక్‌డ్రిల్ కార్యక్రమం గురువారం నాడు సీతానగరం మండలంలోని డిగ్రీ కాలేజ్ లో మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పైప్‌లైన్ భద్రత, అత్య
వసర పరిస్థితులకు సిద్ధత, విభాగాల మధ్య సమన్వయం మరియు ప్రజల భద్రతపై అవగాహన పెంపొందించడమే ఈ మాక్ డ్రిల్ ప్రధాన లక్ష్యమని ఆగ్నేయ ప్రాంత పైప్‌లైన్స్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ మిథున్ కుమార్ శీలం
తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా డిసిఐఎఫ్ కె. కృష్ణమూర్తి, మాట్లాడుతూ మాక్ డ్రిల్‌లో పైప్‌లైన్‌కు సంబంధించిన అత్యవసర పరిస్థితిని అనుకరిస్తూ సంఘటన గుర్తింపు, అత్యవసర సమాచార వ్యవస్థ అమలు, ప్రదేశం వేరుచేయడం, ప్రజల సురక్షిత తరలింపు, గాయపడిన వారికి వైద్య సహాయం, అగ్నిమాపక చర్యలు మరియు విభాగాల మధ్య సమన్వయం వంటి కీలక అంశాలను ప్రదర్శించారు. దీని ద్వారా విపత్తు నిర్వహణలో సిద్ధత స్థాయి, స్పందన వేగం మరియు అత్యవసర నిర్వహణ వ్యవస్థ సామర్థ్యాన్ని అంచనా వేశారు. సింగవరం గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం సింగవరం గ్రామాల్లో ఉన్న రైతులకు ప్రజలు ఎవరికి చెప్పకుండా ఏర్పాటు చెయ్యడం సారి కాదు అని అన్నారు. సింగవరం గ్రామం మీదుగా ఉన్న పైప్ లైన్ హెచ్పిసిఎల్ గేల్ వారు ప్రతి సంవత్సరం గ్రామ అభివృద్ధికి విద్యార్థులకు పాఠశాలలకు సుమారు ఆరు లక్షల రూపాయలు ఇచ్చేవారని అన్నారు. గత పది సంవత్సరాల నుంచి గ్రామాన్ని పట్టించుకోవడంలేదని అనేకసార్లు లెటర్లు పెట్టిన స్పందన లేదని స్పష్టం చేశారు. మండల తాసిల్దార్ అంకం శ్రీనివాస్, పోలీస్ అధికారులు అగ్నిమాపక విద్యుత్ అధికారులు వైద్యశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సాంకేతికతతో సమన్వయం పెంచి పెండింగ్ కేసులు పరిష్కరించాలి




✷ నెలవారీ నేర సమీక్షలో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ భీమవరం, జనవరి 22:** సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ, సమన్వయంతో పని చేసి పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పోలీసు అధికారులను ఆదేశించారు.

గురువారం భీమవరంలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు.

పెండింగ్‌లో ఉన్న కేసులను వేగంగా పరిష్కరించి బాధితులకు సత్వర న్యాయం అందించాలన్నారు. కేసుల దర్యాప్తులో నాణ్యత, వేగం పెంచడంపై దృష్టి సారించాలని, ముఖ్యంగా మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలకు సంబంధించిన పోక్సో కేసులు, అలాగే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. చట్టపరంగా నిర్దేశించిన 60, 90 రోజుల గడువులోగా తప్పనిసరిగా ఛార్జ్ షీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు.

'డయల్ 112' కాల్స్‌కు తక్షణమే స్పందించి బాధితులకు భరోసా కల్పించాలని, సీసీటీఎన్ఎస్, ఐసీజేఎస్ వంటి సాంకేతిక వ్యవస్థలపై స్టేషన్ హౌస్ ఆఫీసర్లు ఎప్పటికప్పుడు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. నేరస్తులకు శిక్షలు పడేలా చూడటంలో కోర్టు కానిస్టేబుళ్ల పాత్ర కీలకమని పేర్కొని, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమన్వయం పెంచి సాక్షులను సకాలంలో కోర్టులకు హాజరుపరచాలని సూచించారు.

గంజాయి రవాణా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, హెల్మెట్ నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రార్థనా మందిరాల వద్ద సీసీ కెమెరాల నిఘా ఉండేలా చర్యలు తీసుకోవాలని, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి. భీమారావు, భీమవరం సబ్ డివిజన్ డీఎస్పీ రఘువీర్ విష్ణు, నరసాపురం సబ్ డివిజన్ డీఎస్పీ జి. శ్రీ వేద, తాడేపల్లి గూడెం సబ్ డివిజన్ డీఎస్పీ డి. విశ్వనాథ్, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ కె.వి.వి.ఎన్ సత్యనారాయణ, డీసీఆర్‌బీ ఇన్స్పెక్టర్ దేశంశెట్టి వెంకటేశ్వరరావు, సీసీఎస్ ఇన్స్పెక్టర్ రాంబాబు, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ అహ్మదున్నీషా, జిల్లా ఐటీ కోర్ ఎస్సై ఎస్. రవి కుమార్‌తో పాటు జిల్లావ్యాప్తంగా ఉన్న సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.




# అడ్డతీగల,ఏలేశ్వరం మధ్య రోడ్డు వెయ్యాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా. రామారావు దీక్ష...





**అడ్డతీగల, పెన్ పవర్, జనవరి22:** ప్రాణాలు పోతున్నాయి పట్టించుకోండి అయ్యా.. అంటూ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా. రామారావు ఆవేదన వ్యక్తం చేశారు. అడ్డతీగల ఏలేశ్వరం రోడ్డును వెంటనే వేయాలని గురువారం నిరసన కార్యక్రమం తెలియజేశారు. సుమారు రెండు దశాబ్దాల కాలం నుండి ఈ రోడ్డు అధ్వానంగా మారింది అని, గిరిజన ప్రాంత ప్రజల ప్రాణాలను కాపాడాలని, ప్రాణాలు కాపాడవలసిన వాళ్లే బక్షిస్తారా, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి అంటూ నినాదాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. రోడ్డు పనులు వెంటనే ప్రారంభించే వరకు ఈ నిరసన కార్యక్రమాన్ని విరమించేది లేదంటూ లోత. రామారావు అన్నారు. ఆయన వెంట గిరిజన సంఘం నాయకులు, గ్రామ, గ్రామాల నుండి తరలివచ్చిన ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అయితే పోలవరం జిల్లాలో పోలీస్ యంత్రాంగం మొత్తం అడ్డతీగల ప్రాంతానికి వచ్చేటువంటి మార్గాలను కట్టుదిట్టమైనటువంటి సహారా కాస్తు, నిరసన కార్యక్రమానికి వద్దకు వెళ్లకుండా ప్రజలను ఇబ్బందులు గురి చేస్తున్నారు అని లోత. రామారావు అన్నారు. అయినా కానీ ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఈ నిరసన కార్యక్రమాన్ని ఆపేది లేదంటూ, కాలినడకన నిరసన కార్యక్రమానికి ప్రజలు తరలివచ్చారు అని లోతా రామారావు తెలిపారు. అయితే కాకినాడ జిల్లాకు చెందిన పోలీసు వర్గాలు కూడా ఏలేశ్వరం, ప్రత్తిపాడు, అన్నవరం, జగ్గంపేట ఎస్సైలు, సీఐలు పెద్దాపురం డిఎస్పి నిరసన కార్యక్రమం వద్దకు రావడం జరిగింది. ప్రాణాలు కాపాడమంటే, మా నిరసన కార్యక్రమాన్ని ఏ విధంగా నిరాశ పరచాలనుకుంటున్నారు అని లోతా. రామారావు అధికారులను ప్రశ్నించారు. ఎవ్వరు ఎన్ని అడ్డంకులు సృష్టించిన, ఒక్కడినైనా సరే నిరసన కార్యక్రమం చేస్తానని, రోడ్డు వేసేవరకు విరమించేది లేదని లోతా. రామారావు అధికారులకు తెగేసి చెప్పారు. గిరిజన సంఘ నాయకులు, వచ్చిన ప్రజలు రోడ్డుపై భీష్మించుకొని కూర్చున్నారు. రాజవొమ్మంగి జడ్పిటిసి, సర్పంచులు నిరసన కార్యక్రమానికి సంఘీభావం తెలుపుతూ రోడ్డుపై బైఠాయించారు.

# గంగానమ్మ జాతర బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ



**ఏలూరు జనవరి 22 పెన్ పవర్:** ఈ నెల 25, 26.తేదీలలో జాతర ఏర్పాట్లలో భక్తులకు ఇబ్బందులు కలగ కుండా ప్రతిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ సిబ్బందికి సూచించారు. క్షేత్ర స్థాయిలో ఏర్పాట్ల ను గురువారం పరిశీలించి, అధికారులకు దిశా నిర్దేశం చేశారు. భక్తుల రక్షణ మరియు సౌక ర్యార్థం ఆలయ పరిసరాలను పరిశీలించి బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జాతర ముగింపు రోజుల్లో భక్తుల రద్దీ విపరీతంగా ఉండే అవకాశం ఉన్నందున, ఎక్కడా తోపు లాటలు జరగకుండా పటిష్టమైన క్యూలైన్లు ఏర్పాటు చేయాలని సూచిం చారు. వృద్ధులు, మహిళలు మరియు చిన్నారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. అమ్మవారి ఊరేగింపు సమయం లో నగరంలో సామాన్య ప్రజలకు ట్రాఫిక్ అంత రాయం కలగకుండా ముందస్తుగా ట్రాఫిక్ మళ్లింపు చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ విభాగం అధికారులను ఆదేశించారు. జాతర కమిటీ సభ్యులు, రెవెన్యూ, మున్సిపల్ మరియు వైద్య ఆరోగ్య శాఖల అధికారులతో పోలీస్ యంత్రాంగం సమ న్వయం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా భక్తుల కోసం అత్యవసర వైద్య శిబిరాలు మరియు తాగునీటి సదుపాయంకల్పించాలన్నారు. జాతర ముసుగు లో అసాంఘిక కార్య కలాపాలు జరగకుండా మఫ్టీలో పోలీసులను రంగంలోకి దించాలని, డ్రోన్ కెమెరాల సీసీ కెమెరాల ద్వారా నిరంతరం నిఘా ఉంచాలని అధికారు లకు స్పష్టం చేశారు. ప్రజలకు మరియు కమిటీ సభ్యులకు విజ్ఞప్తి జాతర కమిటీ సభ్యులు మరియు భక్తులు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని ఎస్పీ కోరారు. నిబంధనలు పాటిస్తూ, క్రమశిక్షణతో అమ్మ వారిని దర్శించుకొని పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో జిల్లా పోలీసు ఉన్నతా ధికారులుఏలూరు డీఎస్పీ డి. శ్రావణ్ కుమార్ , ఎస్ బి ఇన్స్పెక్టర్ మల్లేశ్వర రావు ఏలూరు 1 టౌన్ ఇన్స్పెక్టర్ సత్య నారాయణ, ఎస్ఐ సుధాకర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎం సహాయ నిధితో నిలిపేదలకు ఆర్థిక భరోసా



**సీతానగరం పెన్ పవర్, జనవరి 22:** సీఎం సహాయ నిధితో నిరుపేద కుటుంబాలకు కొంత ఆర్థిక భరోసా లభిస్తుందని తెలుగుదేశం పార్టీ నాయకులు అన్నారు. సీతానగరం మండలంలోని రుడాచైర్మన్ తూర్పుగోదావరి జిల్లా టిడిపి అధ్యక్షులు రాజానగరం నియోజకవర్గ ఇన్చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి సిఫార్సుతో వచ్చిన రెండు లక్షల విలువ గల సీఎం సహాయ నిధి చెక్కును లబ్ధిదారులకు ఆకాశపు మంగాకుమారికి అందజేశారు. ఈ సందర్భంగా చిన కొండేపూడి సొసైటీ అధ్యక్షుడు కాండ్రు శేఖర్ మాట్లాడుతూ వైద్య ఖర్చులతో ప్రజల ఆర్థిక ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందిస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో నిరుపేదలకు సీఎం చంద్రబాబు నాయుడు అన్ని విధాలుగా కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వలవల రాజా, కోసూరి త్రిమూర్తులురాజు, వడ్లమూరి ఏసు రాజు, కాండ్రపు బుల్లి, గండి గోపి తదితరులు పాల్గొన్నారు.

## రెప్కో సిఎస్ ఆర్ నిధులతో బర్మా కాలనీ ఆర్‌సిఎస్ పాఠశాలకు సౌకర్యాలు కల్పన

- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 22:** విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు దాతలు ముందుకు రావాలని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) పిలుపునిచ్చారు. స్థానిక 9వ డివిజన్ బర్మా కాలనీలోని ఆర్‌సిఎస్ మిల్స్ మున్సిపల్ కార్పొరేషన్ మోడల్ ప్రాథమిక పాఠశాలకు రెప్కో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారి సిఎస్ఆర్ నిధులు రూ. 12 లక్షలతో సమకూర్చిన కంప్యూటర్లు, ప్రింటర్లు, టీవీలు, కుర్చీలతో పాటు నూతనంగా ఏర్పాటు చేసిన సర్వేపల్లి రాధాకృష్ణ కళా వేదికను ఆయన విద్యార్థులతో కలిసి ప్రారంభించారు.

అనంతరం ఆయన జేఎన్ రోడ్డులోని ఏకేసీ కళాశాల పక్కన ఉన్న ఎన్టీఆర్ పార్కుకు చేరుకుని అక్కడి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి నగర పాలక సంస్థ అధికారులకు పలు సూచనలు చేశారు. జేఎన్ రోడ్డులో గుంతలు పూడుస్తున్న పనులను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ బర్మా కాలనీలో ఉన్న ప్రైమరీ స్కూల్ అవసరాల కోసం రెప్కో హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సి.ఎస్.ఆర్. నిధుల కింద రూ. 12 లక్షల రూపాయలతో మంచి కార్యక్రమం చేపట్టామన్నారు.

ఈ స్కూల్లో ఒక వేదిక నిర్మించి దానికి సర్వేపల్లి రాధాకృష్ణ పేరు నామకరణం చేయడం సంతోషంగా ఉందన్నారు. ఇక నగరంలోని రోడ్లపై గుంతలు పూడ్చే పనులను కూటమి ప్రభుత్వం రెండు-మూడు నెలల నుంచి చేపట్టిందన్నారు. జెఎన్ రోడ్డులోనూ గుంటలు పూర్తి చేసే పని తీవ్రంగా జరుగుతోందన్నారు. ఏకేసీ కళాశాల వద్ద టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహం ఏర్పాటు చేయనున్నామని, అదే ప్రాంతంలో ట్రాఫిక్‌నకు ఆటంగా ఉన్న కప్పు సాసర్‌ను ఏం చేయాలన్న ఆలోచనలు చేస్తున్నామన్నారు.

ఆంధ్ర కేసరి టంగుటూరు ప్రకాశం పంతులు విగ్రహాన్ని ఇక్కడ ప్రతిష్ఠిస్తే రాబోయే తరాలకు ఆయన గొప్పతనం తెలుస్తుందన్నారు. టీడీపీ నగర అధ్యక్షులు మజ్జి రాంబాబు, నాయకులు కోసూరి చండీప్రియ, కంటిపూడి రాజేంద్రప్రసాద్, కొల్లి బుజ్జి, ముసిని బాబూరావు, ఉప్పులూరి జానకీ రామయ్య, విశ్వనాథ రాజు, దాస్యం ప్రసాద్, కందికొండ అనంత్, నగర పాలక సంస్థ అధికారులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

## ఇంటర్మీడియట్ పబ్లిక్ , ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు సమన్వయ సమావేశం

- డి ఆర్వో టి సీతారామ మూర్తి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 22:** కలెక్టరేట్‌లోని జిల్లా రెవెన్యూ అధికారి ఛాంబర్‌లో బుధవారం ఇంటర్మీడియట్ పబ్లిక్ , ప్రాక్టికల్ పరీక్షలు2026 నిర్వహణపై సమన్వయ సమావేశం జరిగింది.

జిల్లా రెవెన్యూ అధికారి టి. సీతారామ మూర్తి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఫిబ్రవరి, మార్చి2026లో నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పరీక్షలు ఎలాంటి అవాంతరాలు లేకుండా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. ఇంటర్మీడి యట్ పబ్లిక్ పరీక్షలు 23.02.2026 నుండి 24.03.2026 వరకు ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు ఒకే సెషన్‌లో జిల్లాలోని 52 పరీక్షా కేంద్రాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే 01.02.2026 నుండి 10.02.2026 వరకు రెండో సంవత్సరం విద్యార్థులకు సంబంధించిన ప్రాక్టికల్ పరీక్షలు జిల్లాలోని 82 కేంద్రాలలో ఉదయం 9.00 నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు, మధ్యాహ్నం 2.00 నుండి సాయంత్రం 5.00 గంటల వరకు రెండు సెషన్లలో నిర్వహించ నున్నట్లు ఆయన వివరించారు.

పరీక్షల నిర్వహణలో భాగంగా పోలీస్ బందోబస్తు, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు, పరీక్ష కేంద్రం వద్ద జిరాక్స్ కేంద్రాల మూసివేత, సీసీ కెమెరాల పర్యవేక్షణ, నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుధ్య ఏర్పాట్లు, శుద్ధి చేసిన తాగునీటి సదుపాయం, వైద్య సిబ్బంది ద్వారా ప్రథమ చికిత్స, విద్యార్థుల రవాణా కోసం అదనపు బస్సుల నిర్వహణ వంటి అంశాలపై సంబంధిత శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని నిర్ణయించారు.

అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి పరీక్షలను సజావుగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి సూచించారు. ఫిబ్రవరి/మార్చి2026 ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు జిల్లాలో మొత్తం 43,897 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఐ శారద తెలిపారు. ఇందులో జనరల్ స్ట్రీమ్‌కు చెందిన 1వ సంవత్సరం 21,738 మంది, 2వ సంవత్సరం 20,481 మంది కలిపి మొత్తం 42,219 మంది, వృత్తిపరమైన కోర్సులకు సంబంధించిన 1,682 విద్యార్థులతో కలిపి మొత్తం అభ్యర్థుల సంఖ్య 43,897గా ఉన్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో ప్రాంతీయ ఇంటర్మీడియట్ అధికారి శ్రీమతి ఐ. శారద, జిల్లా ఒకేషనల్ విద్యా అధికారిగా శ్రీమతి డి. విజయశ్రీ, వైద్య శాఖ పి. జాన్సన్ రాజు, పోస్టల్ శాఖ వి. కృష్ణ, విద్యాశాఖ ఎం. అమల కుమారి, పోలీస్ శాఖ పి. విజయ్ కుమార్, రెవెన్యూ శాఖ ఎం. సుజాత, డిసిహెచ్ఎం డా ఎమ్. రవికుమార్, కొవ్వూరు మున్సిపాలిటీ ఎస్. వెంకటేశ్వర్లు, ఆర్ఎంసీ నుంచి కె. సత్యనారాయణ హాజరయ్యారు. శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తిరుమల వెంకటేశ్వర స్వామి ని దర్శించుకున్న అడపా శ్రీనివాస్..



**కోరుకొండ, పెన్ పవర్, జనవరి 22:** తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామిని రాజానగరం నియోజకవర్గం జనసేన పార్టీ సీనియర్ నాయకులు అడపా శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అడపా శ్రీనివాస్ నియోజకవర్గ ప్రజలందరికీ మంచి జరగాలని రైతులకు పంటలు బాగా పండాలని ఆయన కోరుకున్నారు.

## రీసర్వే2026 అమలుకు సవరించిన ఎస్ ఓ పి లపై ఓరియెంటేషన్ శిక్షణ





డిఆర్వో సీతారామ మూర్తి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 22:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సిసిఎల్ఏ ఆదేశాల మేరకు దాఖలా కలిగి ఉన్న ఎక్స్ టెంట్ వేరియేషన్, జాయింట్ ఎల్ పి ఎం ల విభజనకు అనుగుణంగా రీ సర్వే2026లో భాగంగా నాలుగో విడతకు ఎంపికైన గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియను నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేసేందుకు సవరించిన వర్క్-ఫ్లో , స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ లు జారీ చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి టి. సీతారామ మూర్తి తెలిపారు. గురువారం స్థానిక శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో నిర్వహించిన ఓరియెంటేషన్ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీతారామ మూర్తి మాట్లాడుతూ, జిల్లా స్థాయిలో రెవెన్యూ సర్వే సిబ్బందికి మాస్టర్ ట్రైనర్ల ద్వారా శిక్షణ ఇవ్వడం ద్వారా రీ సర్వే ప్రక్రియను పారదర్శకంగా, ఖచ్చితంగా అమలు చేయడం లక్ష్యమన్నారు. రీసర్వే మొత్తం 223 రోజులలో 140 పని దినాల్లో పూర్తి చేసి, తుది ఆర్ ఓ ఆర్ లను సమయపాలనతో ప్రచురించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రీసర్వే విజయానికి కీలకమైన అంశం గ్రౌండ్ ట్రూథింగ్ సమయంలో సేకరించిన పాత్య, ప్రాదేశిక డేటాను వెబ్‌ల్యాండ్ 1.0తో సమర్థవంతంగా అనుసంధానం చేయడమేనని జిల్లా రెవెన్యూ అధికారి స్పష్టం చేశారు. అనవసర ఖాతాలు, తప్పు ఎంట్రీలను గుర్తించి తొలగించడం ద్వారా భూ హక్కుల స్పష్టత సాధ్యమవుతుందన్నారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వారి ఆదేశాలు మేరకు క్షేత్ర స్థాయిలో అన్ని స్థాయిలో ఉన్న డివిజన్ నుంచి గ్రామ స్థాయిలో ఉన్న అధికారులకి సిబ్బందికి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అని స్పష్టం చేశారు. ఆర్డీవో ఆర్. కృష్ణ నాయక్ మాట్లాడుతూ, రీసర్వేలో భాగంగా భూమి యజమానుల అభ్యంతరాలను ఏపీ సరిహద్దులు 1923 ప్రకారం సెక్షన్ 10(1), 10(2) కింద చట్టబద్ధంగా పరిష్కరించాల్సి ఉంటుందని తెలిపారు. పట్టా భూములన్నింటినీ తహశీల్దార్ స్థాయిలో ఖరారు చేసి, ప్రభుత్వ భూములను జాయింట్ కలెక్టర్ స్థాయికి పంపే విధానాన్ని అధికారులకు వివరించారు. ఆర్డీవో రాణి సుస్మిత మాట్లాడుతూ, రీసర్వే ప్రక్రియలో భూమి స్వభావం, వర్గీకరణ, సర్వే నంబర్ / సబ్ డివిజన్ దిద్దుబాట్లకు ప్రత్యేక లాగిన్‌ల ద్వారా అదనపు ధృవీకరణ సౌకర్యాలు కల్పించబడ్డాయని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా రికార్డుల సవరణలు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. జిల్లా సర్వే అధికారి బి. లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ, సవరించిన ఎస్ ఓ పి ల ప్రకారం గ్రౌండ్ ట్రూథింగ్, మ్యాపింగ్, డేటా పోర్టింగ్ దశలను ఖచ్చితంగా అమలు చేయాలని చెప్పారు. ప్రత్యేక ఎల్ పి ఎం లు సాధ్యం కాని ఉమ్మడి కేసుల్లో ప్రోరేటా ప్రాతిపదికన విస్తీర్ణ నమోదు విధానాన్ని వివరించారు. మాస్టర్ ట్రైనర్లు గా దేవరపల్లి తహసిల్దార్ ఏం శ్రీనివాస రావు, ఐ వో ఎస్ టి వెంకటేశ్వర రావు లు ఈ శిక్షణా కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం రీసర్వే2026కు సంబంధించి సవరించిన ఎస్ ఓ పి లు, వర్క్-ఫ్లో, టైమ్‌లైన్‌లు, వెబ్‌ల్యాండ్ 2.0 , పో ఎల్ ఆర్ అప్లికేషన్‌లలో జరిగిన మార్పులపై ఫీల్డ్ స్థాయి అధికారులకు స్పష్టమైన అవగాహన కల్పించడం జరిగింది. రీసర్వేను సమయపాలనతో పూర్తి చేసి, అర్హులైన ప్రతి భూస్వామికి టైటిల్ డీడ్‌లు పట్టాదార్ పాస్‌బుక్‌లు జారీ చేయడంగా మాస్టర్ ట్రైనర్లు వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తాసిల్దార్లు, మండల సర్వేయర్లు, గ్రామ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు, మాస్టర్ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ బాలుర పర్యవేక్షణ గృహం పరిశీలించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్ జనవరి 22:** తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి , సీనియర్ సివిల్ జడ్జ్ శ్రీమతి ఎన్. శ్రీ లక్ష్మి స్థానిక కోటగుమ్మంలోని ప్రభుత్వ బాలుర పర్యవేక్షణ గృహంను గురువారం సందర్శించి అక్కడి వసతులను పరిశీలించారు. పర్యవేక్షణ గృహంలో ఉన్న బాలురతో ఆమె మాట్లాడి వారి ఆరోగ్యం, విద్య, బాగోగుల గురించి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా బాలురకు ఆమె సూచనలు చేస్తూ, వ్యసనాలకు , చెడు స్నేహాలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో చదువు కోవాలని హితవు పలికారు. క్రమశిక్షణ, సహనశీలత ప్రతి వ్యక్తికి అత్యంత ముఖ్యమైన లక్షణాలని, వాటిని అలవరుచుకుంటే జీవితంలో మంచి స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు. ఉచితంగా న్యాయ సహాయం పొందడం తమ హక్కు అని బాలురకు వివరించారు. పర్యవేక్షణ గృహంలో సమస్యలు ఉన్నా లేదా న్యాయ సహాయం అవసరమైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు తెలియజేయాలని సూచించారు.

## 28న నగరం లో రాష్ట్ర ఎస్సీ కమిషన్ పర్యటన

- ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఫిర్యాదుల స్వీకరణ బిఅధికారులతో సమీక్ష
- ఇంచార్జి జిల్లా కలెక్టర్ వై మేఘా స్వరూప్



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 22:** రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషన్ గౌరవ చైర్మన్ కే.ఎస్. జవహర్ జనవరి 28న తూర్పుగోదావరి జిల్లా నగరం లో పర్యటించనున్నట్లు ఇంచార్జి జిల్లా కలెక్టర్ వై. మేఘా స్వరూప్ గురువారం తెలిపారు.

ఈ పర్యటనలో భాగంగా షెడ్యూల్డ్ కులాలకు సంబంధించిన ప్రజల నుంచి అర్జీల స్వీకరణతో పాటు జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు.

చట్టంలోని సెక్షన్12 ప్రకారం గత ఐదు సంవత్సరాలుగా షెడ్యూల్డ్ కులాలకు సంబంధించి అమలవుతున్న చట్టపరమైన నిబంధనలు, సంక్షేమ పథకాల అమలు స్థితిగతులపై కమిషన్ సమీక్ష చేయనుంది.

ముఖ్యంగా ఎస్సీ,ఎస్టీ (అట్రాసిటీస్ నివారణ) చట్టం1989, పౌర హక్కుల పరిరక్షణ చట్టం1955 అమలు, ఎస్సీలకు సంబంధించిన భూ సమస్యలు, రిజర్వేషన్ అమలు, పీజీఆర్ఎస్‌లో అందిన ఫిర్యాదుల పరిష్కారం, కమిషన్‌కు ఏటీఆర్‌ల సమర్పణ, జిల్లాడివిజనల్ స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశాల నిర్వహణ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జనవరి 28న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు రాజమహేంద్రవరం ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో షెడ్యూల్డ్ కులాలకు చెందిన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించ. నున్నారు. అనంతరం అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి కలెక్టర్ కార్యాలయం, బొమ్మూరు లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు.

ఈ సమీక్ష సమావేశంలో ఆర్ఓఆర్, పీజీఆర్ఎస్, బ్యాక్‌లాగ్ ఖాళీలు, వివిధ శాఖల్లో అమలవుతున్న ఎస్సీ సంక్షేమ పథకాల పురోగతి వంటి అంశాలపై చర్చ జరగనుందని మేఘా స్వరూప్ తెలిపారు.

ఈ సమావేశానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టి, సంబంధిత రికార్డులు, గణాంకాలతో జిల్లా, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని ఇంచార్జి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ ఆదేశించారు.

## అసెంబ్లీలో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానన్న ఎమ్మెల్యే శిరీష దేవి

హర్షం వ్యక్తం చేసిన వైద్య సిబ్బంది



**కూనవరం,పెన్ పవర్,జనవరి 22.** ఆదివాసి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలంటూ స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి ని వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు కలిసి వినతి పత్రం అందించారు. ఉద్యోగులు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ డిఎస్సీ ద్వారా మెరిట్,రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించి మమ్మల్ని రెగ్యులర్ ఉద్యోగుల స్థానం లో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా తీసుకోవడం జరిగిందని అప్పటి నుంచి ఇప్పటి వరకు 10సం గడిచిన రెగ్యులర్ చేయలేదని తెలిపారు. చాలీచాలని జీతాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నామని,ఆర్థిక పరంగా చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. అత్యవసర డిపార్ట్మెంట్ లో పని చేస్తున్నా మమ్మల్ని త్వరగా రెగ్యులర్ చేసేలా అసెంబ్లీలో మాట్లాడి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ అయ్యేలా ప్రభుత్వం మీద ఒత్తిడి తేవాలని, హాస్పిటల్లో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది సమస్యలను కూడా పరిష్కరించాలని కోరారు. సమస్యలు విన్న ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి అసెంబ్లీలో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో వైద్య ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తుష్టి జోగారావు,పి దేవి, లక్ష్మీ ప్రసన్న కుమారి,కె రాజేశ్వరి,వై అనసూర్య,పి రాజమణి,కె జోగారావు,మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కోట్లమ్మ ఆశీస్సులతో అభివృద్ధి చెందాలి, శ్రీ కొట్టమ్మ తల్లీ జాతర లో పాల్గొన్నా ఎమ్మెల్యే బొలిశెట్టి





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జనవరి 22.** శ్రీశ్రీశ్రీ కోట్లమ్మ తల్లి ఆశీస్సులతో ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ ఆధ్యాత్మిక చింతనతో ఆనందమయ జీవితం గడపాలని శాసనసభ్యులు,రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ ఆకాంక్షించారు. గూడెం మండలం ఆరుగొలను గ్రామంలో గురువారం జరిగిన కోట్లమ్మ జాతర మహోత్సవంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామ దేవతను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ వారి జాతర అందరికీ భోగభాగ్యాలు కలిగించాలని, ఆరుగొలను గ్రామం సుభిక్షంగా ఉండాలని అన్నారు. జాతర స్ఫూర్తి తో గ్రామ ప్రజలు అందరూ ఐకమత్యంతో ఊరి బాగు కోసం కృషి చేయాలని కోరారు. మాజి ప్రెసిడెంట్ నూకల బులియ్య,అడపా ప్రసాద్, పుల్ల బాబి, వర్తనపల్లి కాశి, అడప వీరన్న. పీతల బుచ్చిబాబు, చిక్కాల చిరంజీవి, అడపా వెంకన్న బాబు, గొర్రెల నాని, అడపా అప్పలరాజు, కొండయ్య, సత్యనారాయణ, ముత్యాల నాగార్జున, దూలం విజయ్ కుమార్, వీరమల్లు రాంపండు, నూకల బుల్లయ్య, ఉప్పలపాటి వీర వెంకట సత్యనారాయణ, అడప పండు, కూటమి నాయకులను కార్యకర్తలు పాల్గొన్నారు

## దివ్యాశీగుల సంక్షేమం కోసం జగన్ ఎంతో చేశారు. వైసీపీ నేత వడ్డీ రఘురామ్

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. జనవరి 22.** తాడేపల్లిగూడెం పట్టణ దివ్యాశీగుల సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కో ఆర్డినేటర్ మేడపాటి వీర వెంటక రాఘవేంద్ర రెడ్డి, వికలాంగుల నియోజకవర్గ అధ్యక్షులు పులిమి లక్ష్మణ రావు తాడేపల్లిగూడెం నియోజకవర్గం వైఎస్ఆర్సీపీ ఇంచార్జ్ వడ్డి రఘురాం నాయుడు ని వారి నివాసం వద్ద మర్యాద పూర్వకంగా కలిసారు. వడ్డి రఘురామ్ వాళ్ళతో కూర్చుని వికలాంగుల సమస్యలపై చర్చించారు. వడ్డి రఘురామ్ మాట్లాడుతూ గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో వికలాంగులపై ప్రత్యేక శ్రద్ధ చూపించేవారన్నారు. సదరన్ సర్టిఫికెట్ ల జారీ, వికలాంగులకు పెన్షన్లు, ప్రత్యేక రిజర్వేషన్లు కల్పిస్తూ వారికి ఉపాధి కల్పించేందుకు ప్రాధాన్యత అందించే వారన్నారు. వికలాంగుల సమస్యలు ప్రభుత్వానికి తెలిసి వచ్చేలా కృషి చేస్తామన్నారు. మళ్ళీ వచ్చే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి గారు ముఖ్యమంత్రి అవుతారన్నారని ప్రతీ సమస్య పరిష్కారం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు.



# అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయండి.





* అధికారులకు ఎమ్మెల్యే బొలిశెట్టి సూచన.

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. జనవరి 22.** అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని, అలా కాని పక్షంలో నిధులు వెనక్కి వెళ్లిపోతాయని స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అధికారులకు సూచించారు. తాడేపల్లిగూడెం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. ఎంపీపీ పొనుకుమాటి శేషులత అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు గడువు సమయంలో వినియోగించకపోతే వెనక్కి మళ్ళి పోతాయని అన్నారు. అధికారులు, సర్పంచులు ఎంపీటీసీలు ఈ విషయంపై అవగాహన కలిగి అభివృద్ధి పనులు పూర్తయ్యే విధంగా బాధ్యత వహించాలని అన్నారు. ఎంపీటీసీలు సమావేశానికి ఆలస్యంగా వస్తే సమస్యలు ఎలా చర్చిస్తారని, అభివృద్ధి ఎలా సాధ్యపడుతుందని ప్రశ్నించారు. తాడేపల్లిగూడెం మండలంలో వివిధ గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు జరుగుతున్న తీరుపై ప్రతిరోజు సమీక్ష చేయాలని కోరారు. పనుల అత్యంత నాణ్యంగా ఉండే విధంగా దీర్ఘకాలం ఉండేలా సర్పంచులు బాధ్యత తీసుకోవాలన్నారు. ఎర్రకాలువ ముంపు నివారణ పనులకు రూ. 2.88 కోట్లు మంజూరయ్యాయని, టెండర్లు పూర్తయిన వెంటనే పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఎర్రకాలువ పరివాహక ప్రాంతంలో ఉన్న సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పనులను నిరంతరం పర్యవేక్షించాలని కోరారు. మాధవరం రోడ్డు, అప్పారావుపేట వీరంపాలెం రోడ్డు, మండలంలో గోకులం షెడ్లు మార్చి లోపు పూర్తి చేయాలని కోరారు. ఇళ్ల స్థలాలు త్వరలోనే ఇస్తామని తెలిపారు. జగ్గన్నపేట తదితర ప్రాంతాల్లో తాడిపూడి కాలువ గట్టు మట్టి దోపిడీని అరికడతామని, ఎవరిని ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఇప్పటికే భారీగా మట్టి దోపిడీ జరిగిందని దీనిపై విచారణ జరుగుతుందన్నారు. ఎవరైనా తవ్వకాలకు పాల్పడితే లారీలను సీజ్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ, ఎంపీడీవో, స్పెషల్ ఆఫీసర్ మల్లికార్జున్, ఎంపీపీలు కూటమి నాయకులు పాల్గొన్నారు

## వైసీపీ శ్రేణులతో పార్టీ ఇంచార్జి వడ్డి రఘురామ్ సమీక్ష సమావేశం.

* పాల్గొన్న తాడేపల్లిగూడెం రూరల్, పెంటపాడు మండల నాయకులు.





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. జనవరి 22.** తాడేపల్లిగూడెం సవిత్రుపేటలో తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇంచార్జి వడ్డి రఘురామ్ నాయుడు ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం మండలం, పెంటపాడు మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల తాడేపల్లిగూడెంలో జరగబోయే జిల్లా స్థాయి విస్తృత స్థాయి సమీక్ష సమావేశానికి సంబంధించి పెంటపాడు మండల వైసీపీ శ్రేణులతో చర్చించారు. అలాగే తాడేపల్లిగూడెం రూరల్, పెంటపాడు మండలంలో పార్టీ పరిస్థితులు, తీసుకోవలసిన కార్యాచరణ తదితర అంశాలపై మాట్లాడారు. ప్రతీ కార్యకర్త పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని, ప్రతీ కార్యకర్తకు సముచిత స్థానం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లోకేష్ పుట్టిన రోజు వేడుకలకు జనం తరలి రావాలి. జగదీశ్వరి.



**గోపాలపురం/పోలవరం, పెన్ పవర్, జనవరి 22.**
రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర క్రీడా ప్రాధికారిత సంస్థ నిర్వాహకురాలు కొవ్వాసు జగదీశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. యువ గళం, యువతరం నాయకుడు, విద్యావేత్త, యువతరానికి మార్గదర్శకుడైన అయిన లోకేష్ పుట్టినరోజు వేడుకలు స్థానిక క్యాంప్ కార్యాలయంలో అట్టహాసంగా నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా కేక్ కటింగ్ మిఠాయిలు పంపిణీ అనంతరం గిరిజన గ్రామాలలోని వృద్ధులు వికలాంగులకు నూతన వస్త్రాలు పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నామన్నారు. పార్టీకి వెన్నుముకగా ఉన్నటువంటి లోకేష్ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని వివిధ ఆలయాల్లో పూజలు సైతం నిర్వహించనున్నామనీ జగదీశ్వరి విజయ్ దంపతులు తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు.

## ఏజెన్సీలో ఘోర రోడ్డు ప్రమాదం





**రెండు ద్విచక్ర వాహనాలు ఢీ, ఐదుగురుకి తీవ్ర గాయాలు**

**చింతూరు పెన్ పవర్ జనవరి 22:** చింతూరు ఏజెన్సీ ప్రాంతంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చోడవరం శివారు గ్రామం వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు.
వివరాల ప్రకారం, గన్నవరం నుంచి భద్రాచలం వైపు వెళ్తున్న ఒక ద్విచక్ర వాహనం, భద్రాచలం నుంచి గన్నవరం వస్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని చోడవరం గ్రామ సమీపంలో ఎదురెదురుగా ఢీకొంది. ఈ ప్రమాదంలో మొత్తం ఐదుగురికి గాయాలు కాగా, అందులో నలుగురి పరిస్థితి తీవ్రంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే స్థానికులు 108 అత్యవసర సేవలకు కాల్ చేయగా, అంబులెన్స్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ప్రాథమిక చికిత్స అనంతరం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

## కంటే కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే బత్తుల

**కోరుకొండ, పెన్ పవర్, జనవరి 22:** కోరుకొండ మండలం బూరుగుపూడి గ్రామానికి చెందిన మాజీ సొసైటీ అధ్యక్షులు కంటే సత్యనారాయణ (చంటియ్య) ఇటీవల స్వర్గస్తులైనారని తెలుసుకుని గురువారం ఉదయం కుటుంబ సభ్యులు కంటే గణపతిని పరామర్శించి చంటియ్య చిత్రపటానికి పూలమాల వేసిన రాజానగరం నియోజకవర్గం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## రానున్న రోజుల్లో ఆంధ్రప్రదేశ్ లో బ్యాంకు నుప్రథమ స్థానంలో నిలబెడతాం




* బ్యాంకు పరపతిని నాశనం చేసిన వైసీపీ పాలకవర్గాలు
* 51 విచారణ ను హైకోర్టులోనే తేల్చుకుంటాం
* మీడియా సమావేశంలో ఆర్యాపురం బ్యాంకు చైర్మన్ చల్లా వెల్లడి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 22:** రానున్న రోజుల్లో ఆంధ్రప్రదేశ్ లో సహకార బ్యాంకింగ్ రంగంలో ఆర్యాపురం కోపరేటివ్ అర్బన్ బ్యాంకును ప్రథమ స్థానంలో నిలబెట్టేందుకు కృషి చేస్తున్నామని బ్యాంక్ చైర్మన్ చల్లా శంకర్రావు , పాలకవర్గం వెల్లడించారు. నేటి కాలంలో మారుతున్న ఖాతాదారుల అవసరాలకు అనుగుణంగా తనతో పాటు, బ్యాంకు డైరెక్టర్లు ,ఉద్యోగులు సమిష్టిగా కృషి చేస్తున్నామని తెలిపారు. బ్యాంక్ హాల్లో గురువారం మీడియా సమావేశంలో చల్లా మాట్లాడుతూ, తమ పాలకవర్గం 20 24 జూలై 23 నుండి అధికారంలోకి వచ్చిన 18 నెలల కాలంలోనూ
రూ. 403 కోట్ల రూపాయల నుండి రూ .537 కోట్ల వరకు రుణాలు అందజేశామన్నారు. డిపాజిట్లలో అప్పుల శాతం 59.41 శాతం నుంచి 77 శాతానికి సిడి రేషియో పెంచామన్నారు. రూ. 678 కోట్ల నుండి రూ .669 డిపాజిట్లను పెంచామన్నారు. ఎన్పీఏలు రూ. 100 కోట్ల రూపాయల వరకు తగ్గించామని, 2745 ఎన్పీఏ ఖాతాలను 21 79 లకు తగ్గించామని, గ్రాస్ ఎన్పీఏ ను 6 శాతం లోపల ఉంచామన్నారు. దాంతో ఆర్.బి.ఐ తమ బ్యాంకుపై విధించిన సాఫ్ ఆంక్షలు కూడా గత సంవత్సరం మే నెల నుండి ఎత్తివేసిందన్నారు. బ్యాంకు ఖాతాదారులకు 60 వేల మందికి 12% డివిడెంట్ మేరకు రూ .1.97 కోట్ల రూపాయలను డివిడెంట్ గా అందించామన్నారు. సైబర్ నేరాల నిరోధానికి డిజిటల్ సేవలు అందించే క్రమంలో తమ బ్యాంకు కూడా క్లౌడ్ బ్యాంకింగ్ డేటా సెంటర్ నుఏర్పాటు చేసుకుందని, మొబైల్ బ్యాంకింగ్ సేవలను త్వరలో అందిస్తామన్నారు. అప్పులు వసుళ్ల నిమిత్తం సర్ఫాసి చట్టం అమలు చేస్తున్నామని, కమిషన్ చెల్లించే విధంగా రికవరీ ఏజెన్సీల ద్వారా రికవరీలను చేస్తున్నామన్నారు. ఎంతోకాలంగా పెండింగ్ లో పడిన బ్యాంకుకు చెందిన ఆదాయ పన్ను రిపండ్ రూ. 7. 80 కోట్ల వరకు తిరిగి రాబట్టామని చల్లా తెలిపారు. బ్యాంకుపరంగా తనకొచ్చే గౌరవ జీతభత్యాలను విద్యార్థులకు రూ 4.68 లక్షల రూపాయలను ఆర్థిక సహాయం గా అందచేసినట్లు ఆయన తెలిపారు.
బ్యాంకు పరపతిని నాశనం చేసిన వైసీపీ పాలకవర్గాలు...
వైసిపి అధికారంలో ఉన్న 2019- 2024 వైసీపీ పాలకవర్గాలు బ్యాంకు పరపతిని ఆర్బిఐ , ప్రజల్లోను నాశనం చేశాయని
చల్లా శంకర్రావు, పాలకవర్గ సభ్యులు విమర్శించారు. అధికారంలో ఉన్న 5 సం ల్లోనూ పాలకవర్గం రూ . 44 కోట్ల వరకు డిపాజిట్లు తగ్గించారన్నారు. గత ఐదేళ్లు ఆ పాలకవర్గం వారు రుణాలను తగ్గించారని, సిడి రేషియో 64.32 శాతం నుంచి 59.35 శాతం తగ్గించి వేశారన్నారు. వైసీపీ పాలకవర్గం చేసిన అవినీతి, అక్రమాల వల్ల బ్యాంకు పరపతి ఖాతాదారుల్లో నాశనమైందని, తిరిగి తాము పునరుద్ధణస్తున్నామని అన్నారు. తమను 2024 లో అఖండ మెజారిటీతో 100 శాతం రేటు తో గెలిపించారన్నారు. 51వ సెక్షన్ విచారణ పాత చింతకాయ పచ్చడని, తమపై వచ్చిన ఆరోపణలను హైకోర్టులో సవాల్ చేశామన్నారు. హైకోర్టులోనే తేల్చుకుంటామని, అయితే హైకోర్టు ఆదేశాల ప్రకారంగా జనరల్ బాడీ సమావేశంలో ఈ ఆరోపణల నిజానిజాలపై తీర్మానాలు చేయలేదని చల్లా స్పష్టం చేశారు. త్వరలో బ్యాంకు వైస్ చైర్మన్ ను ఎన్నుకుంటా మన్నారు ఈ సమావేశంలో డైరెక్టర్లు ఎను మల రంగబాబు, తురకల నిర్మల, పిల్లి శ్యామ్ కుమార్, కప్పల సూర్యప్రకాశ్రావు , నీలపాల సత్యనారాయణ, ముదిగ శ్రీనివాసు, పడాల శ్రీనివాసు, బుడీగా రవికుమార్, సిగంపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఇజితమా (తబ్లిక్ జమాత్)అను కార్యక్రమనికి బయలుదేరి వెళ్లిన ముస్లిం సోదరులు.

జండా ఊపి ప్రారంభించిన గొర్రెల శ్రీధర్




**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. జనవరి 22.** తాడేపల్లిగూడెం పట్టణంలో సవిత్ర పేట బిలాల్ మసీదు వద్ద నుండి..
మసీదు కమిటీ సభ్యులు, తాడేపల్లిగూడెం పట్టణ ముస్లిం సోదరులు..దీని ఇజితమా (తబ్లిక్ జమాత్)అను కార్యక్రమంతో..కడప బయలుదేరుతున్న సందర్భంగా
ముస్లిం సోదరులు.. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, తాడేపల్లిగూడెం పట్టణ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్..
శ్రీ గొర్రెల శ్రీధర్ ఆహ్వానించి వారి చేతుల మీదుగా జెండా ఊపి బస్సు ప్రయాణం ప్రారంభించారు.
ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ పట్టణంలో ఉన్నటువంటి ముస్లిం సోదరులందరూ కూడా ఈరోజు వారి యొక్క దైవం అల్లా అనుగ్రహంతో.. ఈ బస్సు ప్రయాణం చేస్తూ కడప వెళ్లి అక్కడ వారి మతానికి సంబంధించి ఆ అల్లా అనుగ్రహంతో మంచి మాటలను నేర్చుకుని, తెలుసుకుని ఇతరులకు సహాయం చేసే విధానంగాని కులమతాలకు అతీతంగా సోదరభావంతో మెలిగే విషయాలను గూర్చి గాని మంచి విషయాలు అలవాట్లను తెలుసుకొని రావడానికి వెళ్తున్నందుకు ఆ యొక్క అల్లా వీరి యొక్క ప్రయాణాన్ని సుఖవంతం చేస్తూ అందరూ ఆ అల్లా అనుగ్రహంతో తిరిగి రావాలని మనస్పూర్తిగా కోరుకుంటున్న అలాగే ఇటువంటి మంచి కార్యక్రమంలో నన్ను భాగస్వామ్యం చేసినందుకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నానని అన్నారు.
ఈ కార్యక్రమంలో వీరితో పాటుగా తాడేపల్లిగూడెం పట్టణ తెలుగు యువత అధ్యక్షులు ఎరుబండి సతీష్ , బత్తుల ప్రసాద్, షేక్ హాజీ, షేక్ రెహమాన్, బిలాల్ మసీద్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## డైమండ్స్ లయన్స్ ఆధ్వర్యంలో యోగ అవగాహనా శిబిరం..






**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. జనవరి 22.** ప్రతి వ్యక్తి మానసిక దృఢత్వం కోసం ధ్యానం యోగా వంటివి చేయాలనీ. శరీరక వ్యాయామం తప్పనిసరిగా చేయాలనీ పేరిచర్ల ఫౌండేషన్ చైర్మన్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు అన్నారు.
స్థానిక గుణ్ణం ఫంక్షన్ హాల్ లో క్లబ్ ట్రెజరర్ లయన్ బడుగు చంద్ర శేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఆరోగ్య అవగాహన కార్యక్రమం లో చంద్రశేఖర్ మాట్లాడుతూ
ఆరోగ్యం పై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని శరీరక వ్యాయామం మానసిక ఉల్లాసం కై ప్రతినిత్యం ఉచితంగా జరిగే యోగా శిబిరం లో ప్రతినెలా మానసిక దృఢత్వం కోసం ప్రత్యేక ధ్యాన శీ ప్రోగ్రాం జరుగుతుంది అని అలానే ప్రజల ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని చిరు ధాన్యాలు.రసాయన రహిత ఆహారం ధాన్యాలు వాడకం మంచిది అని శీతల పనీయాలు మాని ప్రకృతి ప్రసాదించిన కొబ్బరి బొండాలు ధాన్యాల తో చేసిన జావలు సేవించాలని కాలానుగుణంగా ఆహారం అలవాట్లు మార్చుకోవలని అన్నారు ధ్యానం వలన మానసిక పరివర్తన కల్గి శరీరం పై పట్టు సాధిస్తూ జీవన గమనాన్ని నిర్దేశించు కోగలం అన్నారు ప్రతి రోజు ఉచితంగా యోగా నేర్పిస్తూ ప్రజలను చైతన్య పరుస్తున్న లయన్ బడుగు చంద్ర శేఖర్ ని పలువురు శాలువా లతో సత్కరించచి అభినందనలు అందించారు. అందరికి రాగి జావ అందించారు. ఈ కార్యక్రమం లో పలువురు లయన్స్ క్లబ్ సభ్యులు.యోగా వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు..

## నేడు బొడ్డు ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం..

మంత్రి నారా లోకేష్ జన్మదిన సందర్భంగా..



**కోరుకొండ, పెన్ పవర్, జనవరి 22:** శుక్రవారం ఉదయం బూరుగుపూడి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో భారీ స్థాయిలో రక్తదాన కార్యక్రమం బొడ్డు వెంకటరమణ చౌదరి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాజానగరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, రుడా చైర్మన్ మరియు తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ శుక్రవారం మంత్రి నారా లోకేష్ జన్మదినం పురస్కరించుకుని బూరుగుపూడి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు మీడియాకు తెలియపరిచారు. ఈ కార్యక్రమానికి రాజానగరం తెలుగుదేశం పార్టీ నాయకుల అభిమానులు పాల్గొనవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

## పూసపాటిరేగలో నేడు మెగా జాబ్ మేళా

* నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి: కర్రోతు బంగార్రాజు

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ విజయనగరం/పూసపాటిరేగ, జనవరి 22:** రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని పూసపాటిరేగలోని ఎన్.ఎస్.ఆర్. జూనియర్ & డిగ్రీ కళాశాలలో శుక్రవారం (జనవరి 23) మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఎ.పి. మార్క్ ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు తెలిపారు.

ఈ జాబ్ మేళా ద్వారా నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో విస్తృత ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మెగా జాబ్ మేళాలో టెక్ మహీంద్రా, హెటీరో, డెక్కన్, అపోలో టైర్స్, యోకోహామా, డైకిన్, వోల్టాస్, కొల్గేట్, మెడ్‌ప్లస్, వరుణ్ మోటార్స్, నవతా రోడ్ ట్రాన్స్‌పోర్ట్, ముత్తూట్ మనీ, పేటీఎం తదితర ప్రముఖ సంస్థలు పాల్గొననున్నాయని తెలిపారు.

10వ తరగతి నుంచి డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా అర్హత కలిగిన అభ్యర్థులకు వివిధ విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఫ్రెషర్స్‌తో పాటు అనుభవం కలిగిన అభ్యర్థులు కూడా ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చన్నారు.

నిరుద్యోగ యువత ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, అవసరమైన సర్టిఫికెట్లతో హాజరై ఉద్యోగ అవకాశాలను పొందాలని ఆయన కోరారు. వివరాల కోసం 9550262700, 8688572605, 7660828187 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

## డ్రగ్స్ మీద యుద్ధం - యువత పరుగు కి సిద్ధం



**గాజువాక :పెన్ పవర్ ,జనవరి 22 :** భారత దేశ ఘనతంత్రదినోత్సవం జనవరి 26వ తేదీన యువత మత్తు పదార్థాల వినియోగంకి వ్యతిరేకంగా గాజువాక కూడలి నుండి జింక్ గేట్ వరుకు 2కే రన్ పోస్టర్ ను గాజువాక శాసనసభ్యుడు ,ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ మరియు స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ ఆవిష్కరించారు .

నేటితరం యువత మత్తుకి బానిస కాకుండా అవగాహన ర్యాలీకి జాగరపు శ్రీను పిలుపినిచ్చారు.

గణతంత్ర దినోత్సవం రోజున మహాత్మ మదర్ థెరీసా టస్ట్ అధ్యక్షుడు జాగరపు శ్రీను ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిభిరంతో పాటు, పేదలకి ఉచితంగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పేద ప్రజలకి ఉచిత కంటి, దంత, చెవి, ఉచిత క్యాన్సర్ పరీక్షలు, గుండెకి సంబందించిన ఈ సి జి ఉచితంగా సేవలు అందిస్తున్నట్టు జాగరపు శ్రీను తెలిపారు. గాజువాక టిడిపి సమన్వయకర్త ప్రసాదుల శ్రీను , 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ , జనసేన సీనియర్ నాయకులు కరణం కనకరావు ,వందే భారత్ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ వినోద్ బాలు, విశాఖ జిల్లా రజక సంఘం అధ్యక్షుడు తోకాడ రాము, కర్ణం బాబురావు, బొడ్డేపల్లి సంతోష్ కుమార్,చక్రి, నవీన్, తదితరులు పాల్గొన్నారు .

## వైఎస్ఆర్‌సీపీ జిల్లా విస్తృతస్థాయి సమావేశం విజయవంతం

విశాఖ మహిళా విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణ



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జనవరి 22 :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం జిల్లా స్థాయి పార్టీ సంస్థాగత నిర్మాణ విస్తృతస్థాయి సమావేశం బుధవారం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు, విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె. రాజు అధ్య క్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రివర్యులు కురసాల కన్నబాబు హాజరై పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణం, రాబోయే రాజకీయ కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. పార్టీని కేడర్ స్థాయి వరకు మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ఆయన ఈ సందర్భం గా గుర్తు చేశారు.

ఈ సమావేశంలో శాసనమండలి సభ్యురాలు, వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షు రాలు వరుదు కళ్యాణి , ఎమ్మెల్సీ కుంభ రవిబాబు , విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్ఆర్‌సీపీ జిల్లా పార్టీ అధ్యక్షులు, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాస రావు చిన్న శ్రీను, ఉత్తరాంధ్ర జోన్1 కోఆర్డినేట ర్ హర్షవర్ధన్ రెడ్డి , మాజీ మంత్రి బాలరాజు పాల్గొన్నారు. అలాగే సమన్వయకర్తలు వాసుపల్లి గణేష్ కుమార్ , మళ్ళ విజయప్రసాద్ , తిప్పల శ్రీనివాస దేవన్ రెడ్డి , మొల్లి అప్పారావు, మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ , మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయకుమార్, చింతల పూడి వెంకటరామయ్య, మాజీ మేయర్, డి ప్యూటీ మేయర్, రాష్ట్ర, జిల్లా స్థాయి వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, జీవీఎంసీ కార్పొ రేటర్లు, రాష్ట్ర పార్టీ కార్యవర్గం సభ్యులు, నగరజిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీ సభ్యులు, వార్డు అధ్యక్షులు, ముఖ్య నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సమావేశంలో విశాఖ జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి హాజరైన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం మహిళా విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పార్టీ మహిళా విభాగాన్ని మరింత చురుకుగా ముందుకు తీసుకెళ్లడంపై చర్చ జరిగింది.

సమావేశం పార్టీ ఐక్యత, క్రమశిక్షణ, ప్రజా సమస్యలపై పోరాటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిస్తూ విజయవంతంగా ముగిసింది.

## నేరాల నియంత్రణ, ప్రజల భద్రతకు సీసీటీవీలు ఏర్పాటు చేసుకోవాలి




- ఇంచార్జి జిల్లా కలెక్టర్ వై మేఘా స్వరూప్

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 22:** రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలన్నీ నిరంతరం సక్రమంగా పనిచేసేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, సంక్షేమ వసతి గృహాలలో మెరుగైన వసతులు కల్పన, ప్రజల సంతృప్తి స్థాయి పెంచేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఆదేశించినట్లు ఇంచార్జి జిల్లా కలెక్టర్ వై. మేఘా స్వరూప్ తెలిపారు.

గురువారం అమరావతిలోని ఏపీ సచివాలయం నుంచి సీసీటీవీలు, పౌర సేవలు, సంక్షేమ వసతి గృహాలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రజల భద్రత దృష్ట్యా సీసీటీవీలను రియల్ టైమ్ గవర్నెన్స్ సెంటర్ తో అనుసంధానించి నిరంతర పర్యవేక్షణ జరుగుతోందని తెలిపారు. పనిచేయని కెమెరాలను వెంటనే మరమ్మతులు చేయాలని, విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, అలాగే సి ఎస్ ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన సీసీటీవీలను కూడా పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవాలని ప్రధాన కార్యదర్శి సూచించినట్లు తెలిపారు. ప్రధాన కార్యదర్శి సూచనల మేరకు జిల్లాలో క్షేత్ర స్థాయిలో తగిన చర్యలు తీసుకుంటామని, ఇందులో భాగంగా పోలీసు, మున్సిపల్ శాఖ లతో సమన్వయం చేసుకుంటున్నట్లు ఇంచార్జి జిల్లా కలెక్టర్ జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ తెలియ చేశారు. నేరాలు తగ్గుదల, ప్రజల భద్రత నేపథ్యంగా జిల్లాలో సీసీటీవీలు సక్రమంగా పని చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగ్గా ఉండేలా ప్రత్యేక పర్యవేక్షణ చేపడుతున్నామని ఆయన తెలిపారు. ఈ క్రమంలో జిల్లా అధికారులకు, అలాగే ఎంపిడివోలకు ఆయా సంక్షేమ వసతి గృహాలను మ్యాపింగ్ చేయడం జరిగిందన్నారు. విద్యార్థులకు అందుతున్న వసతులపై సంతృప్తి స్థాయి పెరిగేలా అధికారులు, వార్డెన్లు చొరవ చూపాలని స్పష్టం చేసినట్లు తెలిపారు. అనపర్తి బీసీ సంక్షేమ వసతి గృహానికి శుద్ధమైన త్రాగునీరు అందించే అంశంపై రాష్ట్ర అధికారులకు ప్రతిపాదనలు పంపడం జరిగిందని, ప్రజలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సంతృప్తి స్థాయి పెంచేలా అన్ని చర్యలు తీసుకుంటామని వై. మేఘా స్వరూప్ వెల్లడించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక కలెక్టరేట్ నుంచి ఇంచార్జి జిల్లా కలెక్టర్ వై. మేఘా స్వరూప్ తో పాటు జిల్లా రెవెన్యూ అధికారి టి. సీతారామ మూర్తి, సీపీవో ఎల్. అప్పల కొండ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కె.ఎన్. జ్యోతి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి బి. శశాంక, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎండీ ఘయాజుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలకు నో ఎంట్రీ చదువుతోనే ఉజ్వల భవిష్యత్





**సిడీపీవో సుచరిత ఆదిలక్ష్మి**

**గంగవరం, పెన్ పవర్ జనవరి 22:** బాల్యం అనగా పుట్టిన రోజు నుండి 18 సంవత్సరాలు నిండే వరకు అని, ఈ వయస్సులో ఉన్న వారిని చిన్న పిల్లలుగా పరిగణిస్తారని సిడీపీవో సుచరిత ఆదిలక్ష్మి అన్నారు. 18 సంవత్సరాలు లోపు బాలబాలికలు వివాహం చేసుకోవడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. బాల్య వివాహాల వల్ల భవిష్యత్ నాశనం అవుతుందని, పిల్లలు తప్పనిసరిగా చదువులో కొనసాగి ఉన్నత విద్యతో మంచి ఉద్యోగాలు సాధించాలని సూచించారు.

గంగవరం ప్రాజెక్ట్ పరిధిలోని గంగవరం ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో ప్రాజెక్ట్ అధికారిణి వి. సుచరిత ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో బాల్య వివాహ ముక్త భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడీపీవో మాట్లాడుతూ బాల్య వివాహం జరుగుతున్నట్టు తెలిసిన వెంటనే హెల్ప్ లైన్ నెంబర్ 1098 కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీరాణి మాట్లాడుతూ బాల్య వివాహం జరుగుతున్న సందర్భంలో సమీపంలోని స్కూల్ టీచర్లకు లేదా అంగన్వాడీ టీచర్లకు కూడా తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఏబీఎఫ్ ఎల్. హేమ మాధురి, గంగవరం సెక్టార్ సూపర్వైజర్ కె. కుమారి, మహిళా పోలీసు జయలక్ష్మీ, హెల్త్ సిబ్బంది జి. నారాయణమ్మ, కె. రామాయమ్మ, అంగన్వాడీ వర్కర్ మీ. లక్ష్మీ సుజాత పాల్గొన్నారు.

## అనధికార లేఅవుట్‌లపై కఠిన చర్యలు






**పంచాయతీల్లో వారం రోజుల్లో గుర్తింపు నోటీసులు జారీ**

**చైర్ పర్సన్ బొడ్డు వెంకట రమణ**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 22** రుడా చైర్‌పర్సన్ బొడ్డు వెంకట రమణ చౌదరి ఆధ్వర్యంలో, వైస్‌చైర్‌పర్సన్ వై. మేఘ స్వరూప్, సూచనల మేరకు గురువారం రుడా కాన్ఫరెన్స్ హాల్‌లో రుడా పరిధిలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులతో లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ , బిల్డింగ్ పెనలైజేషన్ స్కీమ్ అమలుపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనధికార లేఅవుట్‌లు, కట్టడాలపై అమలులో ఉన్న ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలపై పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. అనధికార లేఅవుట్‌ల వల్ల ప్రజలకు, సమాజానికి కలిగే నష్టాలు, డెవలప్‌మెంట్ ఛార్జీల రూపంలో పంచాయతీలు కోల్పోతున్న ఆదాయం, తద్వారా మౌలిక వసతుల కల్పనకు ఏర్పడుతున్న అడ్డంకులపై చైర్‌పర్సన్ వివరించారు. రాబోయే వారం రోజుల్లో ప్రతి పంచాయతీ పరిధిలోని అన్ని అనధికార లేఅవుట్‌లను గుర్తించి, ఏపీ ఎంఆర్‌యుడిఏ చట్టం89 ప్రకారం ప్రొవిజనల్ ఆర్డర్, కన్ఫర్మేషన్ ఆర్డర్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. సరిహద్దు రాళ్లు తొలగించడం, అనధికార రోడ్లను తొలగించడం, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, పంచాయతీ కార్యాలయ నోటీస్ బోర్డులు ముఖ్య ప్రదేశాల్లో అనధికార లేఅవుట్ వివరాలు ప్రదర్శించడం వంటి చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని సూచించారు. అమలు తీరును ప్రత్యేక బృందాలతో తనిఖీ చేసి, నిర్లక్ష్యం వహించిన పంచాయతీ కార్యదర్శులపై క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేస్తామని స్పష్టం చేశారు. లేఅవుట్ డెవలపర్లు, ప్రజలకు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా విస్తృత అవగాహన కల్పించాలని కోరారు.

సమావేశంలో పాల్గొన్న పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలో చేపట్టిన చర్యలపై వివరాలు వెల్లడించారు.

రూడా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ జివిఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ, ఇప్పటికే గుర్తించిన అనధికార లేఅవుట్‌ల వివరాలు తెలియజేస్తూ తదుపరి కార్యాచరణ ప్రణాళికను వివరించారు. సర్వే నెంబర్ల ఎఫ్ ఎం బి లు, అడంగల్ కాపీలు, రఫ్ స్కెచ్‌లు, రిజిస్టర్డ్ సేల్ డీడ్‌లు సమర్పించి రుడా కార్యాలయం ద్వారా రెగ్యులరైజేషన్ చేసుకోవచ్చని తెలిపారు. అనధికార లేఅవుట్‌లలోని రోడ్లను స్వాధీనం చేసుకోరాదని, భవన నిర్మాణ అనుమతులు ఇవ్వరాదని స్పష్టం చేశారు.

రూడా ప్లానింగ్ ఆఫీసర్ నార్కెడిమిల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, బిల్డింగ్ ప్లాన్ రిజిస్టర్, అనధికార కట్టడాల రిజిస్టర్, అనధికార లేఅవుట్ రిజిస్టర్‌ల నిర్వహణపై వివరించారు. పంచాయతీల్లో నిర్మాణ అనుమతులు 'పిఆర్ఐఎస్' యాప్ ద్వారా మాత్రమే జారీ చేయాలని సూచించారు.

ఆర్ డి డి టి జి. సుబ్బారావు మాట్లాడుతూ, ఏపీ ఎంఆర్‌యుడిఏ చట్టంపై పంచాయతీ కార్యదర్శులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, రుడా మార్గదర్శకాలను పాటిస్తూ ఆర్థిక ప్రతిపత్తి పెంపుతో పాటు అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో రూడా సెక్రెటరీ ఎంవీఆర్ సాయి బాబా, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆర్. ప్రశాంత్‌తో పాటు ఇతర ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా

-చింతకాయల విజయ్

**నర్సీపట్నం, పెన్ పవర్ (జనవరి 22) :** నిరుపేదల ఆరోగ్యానికి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ అన్నారు. గురువారం నర్సీపట్నంలో జరిగిన కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన తన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా చింతకాయల విజయ్ మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ, ఖరీదైన వైద్యం చేయించుకోలేని పేదలకు సీఎం సహాయనిధి ఆపద్బాంధవిలా నిలుస్తోందన్నారు. ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అర్హులైన బాధితులకు సత్వరమే సాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నర్సీపట్నం, మాకవరపాలెం, నాతవరం మండలాలకు చెందిన లబ్ధిదారులకు దాదాపు రూ. 4.50 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. నర్సీపట్నం మున్సిపాలిటీలో శారదానగర్‌కు చెందిన చిన్నారి వాగ్దేవి వైద్యం కోసం మంజూరైన రూ. 3,45,679/- చెక్కును అందజేశారు. మాకవరపాలెం మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన శెట్టి దేముడుకు రూ. 36,327/- చెక్కును అందించారు. మాకవరపాలెంకు చెందిన రుత్తల రామాయమ్మకు రూ. 31,843/- విలువైన చెక్కును అందజేశారు. నాతవరం మండలం డి.యర్రవరం గ్రామానికి చెందిన రొంగలి నూకాలతల్లికి రూ. 36,084/- చెక్కును పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ, నాతవరం మండలం టిడిపి పార్టీ ప్రెసిడెంట్ నందిపల్లి వెంకటరమణ, మాకవరపాలెం మండలం పార్టీ ప్రెసిడెంట్ ఆర్ వై పాత్రుడు, శెట్టిపాలెం సర్పంచ్ అల్లు నాయుడు, దుర్గా మల్లేశ్వరి ఆలయ కమిటీ చైర్మన్ జంపన నాగేంద్రరాజు స్థానిక నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## పారదర్శకంగా పట్టాదారు పాసు పుస్తకాల పరిశీలన

జాయింట్ కలెక్టర్ ఎస్. సేధు మాధవన్.



**భోగాపురం, స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్.జనవరి 23:** పట్టాదారు పాసు పుస్తకాల వెరిఫికేషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ సేధు మాధవన్ ఆదేశించారు. ఆయన గురువారం భోగాపురం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో సిబ్బంది నిర్వహిస్తున్న రికార్డుల పరిశీలన తీరును ఆయన స్వయంగా పర్యవేక్షించారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, భూమి రికార్డుల ధృవీకరణ అనేది అత్యంత కీలకమైన ప్రక్రియ అని, ఇందులో ఎటువంటి పొరపాట్లు జరగకుండా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. తప్పులు లేని పాస్ పుస్తకాలను రూపొందించాలని ఆదేశించారు.

ఈ తనిఖీలో తహసీల్దార్ ఎం.రమణమ్మ, రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్తమ పోలీస్ అధికారులకు అవార్డ్ లు అందజేసిన విశాఖ సి పి శంఖ బ్రత బాగ్చి ఐపిఎస్



**గాజువాక :పెన్ పవర్ . జనవరి 22** డిసెంబర్ నెల నేర సమీక్ష టెంపుల్ ఆఫ్ లెర్నింగ్ సమావేశ మందిరం లో సి పి శంఖ బ్రత బాగ్చి ఐపిఎస్ గాజువాక ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ షేక్ హుస్సేన్ కు 2025 సంవత్సరానికి ఉత్తమ దర్యాప్తు అధికారి అవార్డ్ , బెస్ట్ ట్రాఫిక్ మేనేజ్మెంట్ అవార్డ్ , గాజువాక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ద్వితీయ ఉత్తమ పోలీస్ స్టేషన్ అవార్డ్ లను సిటీ పోలీస్ అధికారుల సమక్షం లో బహుకరించారు.

2025 సంవత్సరం లో మూసి వేసిన కంచరపాలెం, ఏం ఆర్ పేట లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ లకు సంబంధించిన రెండు మర్డర్ కేసులను విజయవంతంగా ఛేదించడం లో ప్రతిభ చూపినందుకు గాను ఉత్తమ పరిశోధన అధికారి గోల్డ్ మెడల్ మరియు ట్రోఫీ బహుకరించారు.

గాజువాక లో ట్రాఫిక్ ఎన్ఫోర్స్మెంట్ బాగా చేస్తూ, వినూత్న పద్ధతుల్లో ట్రాఫిక్ సమస్య ల పరిష్కారానికి కృషి చేస్తున్నందుకు ట్రాఫిక్ మేనేజ్మెంట్ లో గోల్డ్ మెడల్ మరియు ట్రోఫీ బహుకరించారు. విశాఖపట్నం సిటీ లో గాజువాక పోలీస్ స్టేషన్ ద్వితీయ ఉత్తమ పోలీస్ స్టేషన్ గా ఎంపిక కావడం తో సిల్వర్ మెడల్ & ట్రోఫీ బహుకరించారు.

అందరికంటే ఎక్కువగా మూడు మెడల్స్ సాధించారు.

# టీ20 వరల్డ్ కప్ నుంచి బంగ్లాదేశ్ ఔట్..
# భారత్‌లో ఆడేందుకు నిరాకరణ

- భారత్‌లో ఆడేది లేదంటూ టీ20 వరల్డ్ కప్ నుంచి వైదొలిగిన బంగ్లాదేశ్
- భద్రతా కారణాల రీత్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపిన బంగ్లా ప్రభుత్వం
- వేదిక మార్పు విజ్ఞప్తిని తిరస్కరించిన ఐసీసీ.. బంగ్లా స్థానంలో స్కాట్లాండ్
- ప్రభుత్వ నిర్ణయానికి కట్టుబడి ఉన్నామన్న బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్ 2026లో ఆడకూడదని బంగ్లాదేశ్ సంచలన నిర్ణయం తీసుకుంది. భారత్‌లో జరిగే మ్యాచ్‌లు ఆడేందుకు తమ జట్టు నిరాకరిస్తున్నట్లు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డ్ (దీజదీ) స్పష్టం చేసింది. భద్రతాపరమైన ఆందోళనలు, రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. దీంతో బంగ్లాదేశ్ స్థానంలో స్కాట్లాండ్‌ను టోర్నీలోకి తీసుకుంటున్నట్లు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ప్రకటించింది.తమ మ్యాచ్‌లను భారత్ నుంచి శ్రీలంకకు తరలించాలని బీసీబీ చేసిన విజ్ఞప్తిని ఐసీసీ తిరస్కరించింది. జనవరి 21న జరిగిన బోర్డు సమావేశంలో ఈ విషయంపై చర్చించిన ఐసీసీ, భారత్‌లో భద్రతా సమస్యలు లేవని, షెడ్యూల్‌ను మార్చడం సాధ్యం కాదని తేల్చిచెప్పింది. భారత్‌లో ఆడేందుకు బంగ్లాదేశ్‌కు ఒక రోజు గడువు ఇవ్వగా, బీసీబీ ఆ ప్రతిపాదనను కూడా తోసిపుచ్చింది.

ఈ పరిణామాల నేపథ్యంలో ఢాకాలో బీసీబీ అధ్యక్షుడు అమినుల్ ఇస్లాం, క్రీడా సలహాదారు అసిఫ్ నజ్రుల్, ఆటగాళ్లు లిట్టన్ దాస్, నజ్ముల్ హొస్సేన్ షాంటో తదితరులతో సమావేశమయ్యారు. ప్రపంచకప్ ఆడాలనే ఆసక్తి ఆటగాళ్లకు ఉన్నప్పటికీ, ప్రభుత్వ నిర్ణయానికే కట్టుబడి ఉండాలని నిర్ణయించారు. "మేం ఐసీసీతో చర్చలు కొనసాగిస్తాం, మా పోరాటం ఆపబోం" అని బీసీబీ అధ్యక్షుడు ఈ సందర్భంగా తెలిపారు.గతంలో ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను ఐపీఎల్ నుంచి తప్పించినప్పటి నుంచి ఇరు దేశాల క్రికెట్ బోర్డుల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. తాజా వివాదం దానికి కొనసాగింపుగా భావిస్తున్నారు. టోర్నీ నుంచి తప్పుకున్నా 2022 ఐసీసీ ఒప్పందం ప్రకారం ఆర్థికంగా ఎలాంటి నష్టం ఉండదని బీసీబీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పుడు గ్రూప్-సిలో ఇంగ్లండ్, వెస్టిండీస్ వంటి జట్లతో బంగ్లాదేశ్ బదులు స్కాట్లాండ్ తలపడనుంది.

# రోహిత్ శర్మకు అరుదైన గౌరవం.. యూనివర్సిటీ నుంచి హిట్ మ్యాన్‌కు డాక్టరేట్





**హైదరాబాద్ పెన్ పవర్:** భారత జట్టు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ అరుదైన గౌరవం అందుకోనున్నాడు. అజీంక్య డివై పాటిల్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ (డి.లిట్.) అందుకోనున్నారు. శనివారం (జనవరి 24) జరిగే 10వ స్నాతకోత్సవ కార్యక్రమంలో రోహిత్ శర్మకు ఈ సన్మానం జరగనుంది. రోహిత్ క్రీడల్లో చేసిన అసమానమైన కృషికి.. అదేవిధంగా చాలా మందికి స్ఫూర్తినిచ్చిన కారణంగా డాక్టరేట్ గౌరవంతో సత్కరించనున్నారు. అభిమానులు క్రికెట్‌లో 'హిట్‌మ్యాన్' గా పిలుచుకునే రోహిత్ కు ఇది అతని కెరీర్ లో ఒక గొప్ప గౌరవంగా నిలిచిపోనుంది.

**బోటు ప్రయాణ టిక్కెట్లు**

ఈ వేడుకకు విశ్వవిద్యాలయ అధ్యక్షుడు.. ఛాన్సలర్ డాక్టర్ అజీంక్య డి.వై. పాటిల్ అధ్యక్షత వహిస్తారు. ఈ వేడుక స్టార్‌లతో నిండి ఉంటుందని.. రోహిత్ ప్రధాన ఆకర్షణగా ఉంటారని ప్రకటించింది. రోహిత్ శర్మ ప్రస్తుతం అంతర్జాతీయ క్రికెట్ లో ఒకటే ఫార్మాట్ లో ఆడుతున్నాడు. 2024 టీ20 వరల్డ్ కప్ గెలిచినా తర్వాత రోహిత్ టీ20 ఫార్మాట్ కు రిటైర్మెంట్ ప్రకటించాడు. 2025లో ఇంగ్లాండ్ సిరీస్ కు ముందు టెస్ట్ సిరీస్ కు కూడా గుడ్ బై చెప్పాడు. వన్డే ఫార్మాట్ మాత్రమే ఆడుతున్న హిట్ మ్యాన్ 2027 వన్డే వరల్డ్ కప్ తర్వాత క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. తన కెరీర్‌లో 67 మ్యాచ్‌లు ఆడిన రోహిత్ 4,301 రన్స్ చేశాడు. ఇందులో 12 సెంచరీలు, 18 ఫిఫ్టీలు ఉన్నాయి. 2013లో ఈడెన్ గార్డెన్స్‌లో వెస్టిండీస్‌పై టెస్టు అరంగేట్రం చేసిన అతను గతేడాది మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియాపై చివరి మ్యాచ్ ఆడాడు. ఆస్ట్రేలియాతో గత వరల్డ్ టెస్టు చాంపియన్ షిప్ ఫైనల్లో ఇండియాను నడిపించిన రోహిత్ 24 టెస్టుల్లో కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఇందులో ఇండియా 12 మ్యాచ్‌ల్లో నెగ్గి తొమ్మిదింట్లో ఓడింది. మూడు డ్రాగా ముగిశాయి. గతేడాది టీ20 వరల్డ్ కప్ నెగ్గిన తర్వాత షార్ట్ ఫార్మాట్ నుంచి తప్పుకున్న రోహిత్.. ఇకపై కేవలం వన్డే ఫార్మాట్‌లోనే ఇండియాకు ఆడనున్నాడు. 159 టీ20 మ్యాచ్ ల్లో రోహిత్ 4231 పరుగులు చేశాడు. కెప్టెన్ గా ఇండియాకు 2024 టీ20 వరల్డ్ కప్ అందించాడు. వన్డే ఫార్మాట్ లో జరిగిన 2025 ఛాంపియన్స్ ట్రోఫీ అందించి ఏడాదిలోనే ఇండియాకు రెండు ఐసీసీ టైటిల్స్ అందించిన కెప్టెన్ గా నిలిచాడు. 2023 లో టీమిండియా వన్డే వరల్డ్ కప్ తో పాటు టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్ కు చేరుకుంది. బ్యాటర్ గా 282 వన్డేలాడిన రోహిత్ 11577 పరుగులు చేశాడు.

# గిల్ టైమ్ బాగోలేదు.. రెండో బంతికే టీమిండియా కెప్టెన్ డకౌట్




**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా వన్డే, టెస్ట్ కెప్టెన్ శుభమాన్ గిల్ కు ప్రస్తుతం బ్యాడ్ లక్ నడుస్తోంది. గత ఏడాది ఇండియా టెస్ట్, వన్డే కెప్టెన్సీ గిల్ కు అప్పగించడంతో పాటు టీ20ల్లో వైస్ కెప్టెన్ గా ప్రకటించారు. ఒక్కసారిగా గిల్ ఆల్ ఫార్మాట్ కెప్టెన్ గా కితాబులందుకున్నాడు. అయితే ఆసియా కప్ నుంచి గిల్ కు బ్యాడ్ టైమ్ స్టార్ట్ అయింది. ఆసియా కప్ లో పేలవ ప్రదర్శన చేసిన తర్వాత కెప్టెన్ గా ఆస్ట్రేలియాతో జరిగిన తొలి సిరీస్ లో కెప్టెన్ గా, బ్యాటర్ గా ఫెయిలయ్యాడు. సౌతాఫ్రికాతో టీ20 సిరీస్ తర్వాత ఇండియా టీ20 జట్టులో స్థానం కోల్పోయాడు. స్వదేశంలో జరగబోయే టీ20 వరల్డ్ కప్ కు ఫామ్ లేని కారణంగా గిల్ ఎంపిక కాలేదు. 2026 లోనూ గిల్ కు మంచి ఆరంభం రాలేదనే చెప్పాలి. గిల్ కెప్టెన్సీలో న్యూజిలాండ్ చేతిలో టీమిండియా సొంతగడ్డపై 1-2 తేడాతో వన్డే సిరీస్ కోల్పోయింది. వరల్డ్ కప్ లో చోటు కోల్పోయిన గిల్ రంజీ ట్రోఫీ ఆడాలని నిర్ణయించుకున్నాడు. గురువారం (జనవరి 22) సౌరాష్ట్రతో జరుగుతున్న మ్యాచ్ లో బరిలోకి దిగాడు. తొలి ఇన్నింగ్స్ లో గిల్ డకౌటయ్యాడు. నేహాల్ వధేరా ఔటైన తర్వాత క్రీజ్ లోకి వచ్చిన గిల్ ఎదుర్కొన్న రెండో బంతికే పెవిలియన్ బాట పట్టాడు. పార్థ్ బట్ బౌలింగ్ లో ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. ఫామ్ కోసం రంజీ బాట పట్టిన గిల్.. డొమెస్టిక్ క్రికెట్ లోనూ ఈ టీమిండియాకు నిరాశే ఎదురైంది. ఈ మ్యాచ్ విషయానికి వస్తే మొదట బ్యాటింగ్ చేసిన సౌరాష్ట్ర 172 పరుగులకు ఆలౌటైంది. గోహిల్ ఒక్కడే 82 పరుగులు చేసి సగానికి పైగా పరుగులు చేశాడు. ప్రేరక్ మన్ కండ్ 32 పరుగులు చేసి రాణించాడు. వీరిద్దరూ తప్పితే మిగిలిన వారు తక్కువ స్కోర్ కే ఔటయ్యారు. పంజాబ్ బౌలర్లలో హరిప్రీత్ బ్రార్ ఏకంగా 6 వికెట్లు తీసుకొని అదరగొట్టాడు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన పంజాబ్ కూడా బ్యాటింగ్ లో ఘోరంగా విఫలమైంది. ప్రస్తుతం 8 వికెట్ల నష్టానికి 122 పరుగులు చేసింది. సౌరాష్ట్ర బౌలర్లలో పార్ద్ బట్ నాలుగు వికెట్లు తీసుకొని రాణించాడు.

# మహేష్ బిజినెస్ స్కెచ్ అదుర్స్!



మల్టీప్లెక్స్ చైన్‌ని విస్తరిస్తున్న సూపర్‌స్టార్ మహేష్ బిజినెస్ స్కెచ్ అదుర్స్ అంటున్నారు ఫ్యాన్స్. ఓ పక్క సినిమాలు చేస్తూనే మరో పక్క మల్టీప్లెక్స్ బిజినెస్‌ని మహేష్ పరుగులు పెట్టిస్తున్నారు. ఏషియన్ ఫిలింస్ అధినేత సునీల్ నారంగ్‌తో కలిసి ఏఎంబీ బ్రాండ్‌ని క్రియేట్ చేసిన ఆయన దీనిని దేశ వ్యాప్తంగా విస్తరించే ప్లాన్‌ని అమలు చేసే పనిలో ఉన్నాడు. స్టార్ హీరోలు అల్లు అర్జున్, విజయ్ దేవరకొండ, రవితేజ ఒక్కో మల్టీప్లెక్స్ థియేటర్లతో సరిపెట్టుకుంటే మహేస్ మాత్రం భారీ చైన్ సిస్టమ్‌ని క్రియేట్ చేయబోతున్నాడు. తొలి ప్రయత్నంగా హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఏరియాలో ఏఎంబీ సినిమాలు పేరుతో తొలి మల్టీప్లెక్స్‌ని ప్రారంభించారు. ప్రస్తుతం అది ఐటీ కారిడార్‌కు అత్యంత సమీపంలో ఉండటం, లగ్జరీ జనావాసాల మధ్య ఉండటంతో దీనికి ప్రేక్షకుల తాకిడి విపరీతంగా ఉంటోంది. ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు ఇక్కడ పలు బ్రాండ్‌లకు సంబంధించిన రెస్టారెంట్స్, క్లాతింగ్ షోరూమ్స్ వంటి వివిధ మినీ షోరూమ్స్ ఉండటంతో వీకెండ్స్‌లో ప్రేక్షకులు అధిక సంఖ్యలో ఇక్కడికి విచ్చేస్తున్నారు. దీంతో సిటీలో మరిన్ని మల్టీప్లెక్స్‌లకు శ్రీకారం చుట్టాలని ప్లాన్ చేసిన మహేష్ ఇప్పటికే హకీంపేట్, ,ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లలో రెండు థియేటర్లని మొదలు పెట్టాడు. ప్రస్తుతం కన్‌స్ట్రక్షన్ దశలో ఉన్న ఈ మల్టీప్లెక్స్ థీయేటర్స్ త్వరలోనే ప్రారంభం కానున్నాయి. సిటీలో మరిన్ని మల్టీప్లెక్స్‌లని సునీల్ నారంగ్‌తో కలిసి ప్లాన్ చేస్తున్న మహేష్ బెంగళూరులోనూ కపాలి థియేటర్ ప్రాంగణంలో ఏఎంబీ సినిమాస్ కపాలి థియేటర్ ని జనవరి 16న లాంఛనంగా ప్రారంభించిన విషం తెలిసిందే. ఇదే తరమాలో చెన్నైలోనూ భారీ స్థాయిలో మల్టీప్లెక్స్‌లకు శ్రీకారం చుట్టబోతున్నారట. దానితో పాటు గోవాకు కూడా తన మల్టీప్లెక్స్ థియేటర్ల చైన్‌ని విస్తరించే పనిలో ఉన్నట్టుగా టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. 3డీ స్క్రీన్స్, డాల్బీ అట్మాస్ సౌండ్ సిస్టమ్‌తో పాటు ఐమ్యాక్స్ టెక్నాలజీ థియేటర్లని కూడా అందుబాటులోకి తీసుకురానున్నారట. ఇదిలా ఉంటే మహేష్ ప్రస్తుతం జక్కన్న అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ -వారణాసి-లో నటిస్తున్నాడు. దీనికి సంబంధించిన షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. మరో ఏడు నెలలు పూర్తయితే షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. మిగిలిందిక వీఎఫ్ ఎక్స్ వర్క్.. దానికి ఎక్కువ టైమ్ పడుతుంది కాబట్టి ఈ భారీ పాన్ వరల్డ్ మూవీని 2027లో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టుగా టీమ్ ప్రకటించింది. అయితే సినిమా రిలీజ్ వాయిదా పడే అవకాశం ఉందని వార్తలు వస్తున్న నేపథ్యంలో టీమ్ క్లారిటీ ఇచ్చింది. 2027లో పక్కాగా వస్తామని ఫుల్ క్లారిటీ ఇచ్చేసింది. అయితే మార్చిలో వచ్చే అవకాశాలు ఉన్నాయని కొంత మంది అంటుంటే ఏప్రిల్ ఫస్ట్ వీక్‌లో వచ్చే అవకాశాలు ఉన్నాయని మరికొంత మంది అంటున్నారు.



**కావ్య థాపర్ టాలీవుడ్ & కోలీవుడ్ గ్లామర్ క్వీన్**



**ఫాతిమా సనా షేక్ ఉల్లాసభరితమైన ఫోటోను పంచుకున్నారు**

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965